సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

MAY day

హైదరాబాద్
శుక్రవారం, 01.05.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 189
పేజీలు: 12 వెల: రూ. 5

## దేశానికే ఆదర్శంగా అక్రెడిటేషన్ల జారీ

- సంఖ్య తేలితే జర్నలిస్ట్‌లకు మరిన్ని సౌకర్యాల కల్పన
- గతం కంటే రెట్టింపు సంఖ్యలో మంజూరు
- మే1 అన్ని జిల్లాల్లో పంపిణీకి ఆదేశం, మే 15 వరకుబస్సు పాస్‌ల పొడిగింపు
- రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

03



## తిరుమలలో టాలీవుడ్ హీరో పెళ్లి

ప్రేమించిన కావ్య రెడ్డికి మూడుముళ్లు వేసిన బెల్లంకొండ సాయి

- రెండు కుటుంబాల సమక్షంలో శుభకార్యం
- వేంకటేశ్వర ఆలయంలో వివాహం
- హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్‌కు సన్నాహాలు

02



## బరాజ్‌లకు మరమ్మతు చేస్తాం

ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్

- అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం
- దశల వారీగా సాంకేతిక పరీక్షలు
- నిరంతరం పర్యవేక్షణలో పనులు

09



## హైకోర్టుకు హరీష్‌రావు

అర్హులైన రైతులకు రుణమాఫీ కావట్లేదని పిటిషన్

10

- రుణమాఫీ అమలు లోపాలపై కోర్టు దృష్టి
- సిద్దిపేటలో వేలాది రైతులకు అందని లబ్ది
- హైకోర్టు సూచనతో పిటిషన్ ఉపసంహరణ





# మెట్రో ఎందుకు ఫెయిల్?

## ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీగా నిలిచిన మెట్రో ప్రాజెక్టు ప్రభుత్వ హస్తగతం

HYDERABAD METRO RAIL

- ఎల్ అండ్ టీ వైదొలగడంతో హైదరాబాద్ మెట్రోకు కొత్త దశ ప్రారంభం
- ₹1,461 కోట్ల డీల్‌తో మెట్రోపై పూర్తి నియంత్రణ సాధించిన ప్రభుత్వం
- ₹13,538 కోట్ల అప్పులతో భారీ ఆర్థిక భారం భుజాన వేసుకున్న రాష్ట్రం
- కోవిడ్ దెబ్బతో నష్టాల్లో కూరుకుపోయిన మెట్రోకు మార్గమధ్యంలో మలుపు
- ప్రైవేట్ మోడల్ విఫలం.. ప్రభుత్వ నిర్వహణే పరిష్కారమా?
- రెండు దశలను ఏకీకృతం చేసి సమగ్ర రవాణా దిశగా అడుగులు
- రోజుకు 4.5 లక్షల ప్రయాణికులకు సేవలు.. ఇక మెరుగైన సదుపాయాలపై ఆశలు
- భవిష్యత్ మెట్రో విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన టేకోవర్ నిర్ణయం
- పీపీపీ నుంచి పబ్లిక్ మోడల్‌కు మారిన మెట్రో
- నగరాభివృద్ధికి కొత్త దిశ

**ముద్ర డెస్క్ :**

మహానగర రవాణా ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. దశాబ్దన్నర కాలంగా ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిచిన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు, ఇప్పుడు పూర్తిస్థాయిలో ప్రభుత్వ పరం అయింది. ప్రపంచంలోనే అతి పెద్ద పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ (PPP) ప్రాజెక్టుగా రికార్డు సృష్టించిన ఈ మెగా ప్రాజెక్టు, ఆర్థిక ఒడిదుడుకుల నేపథ్యంలో గురువారం (ఏప్రిల్ 30, 2026) నాడు తెలంగాణ ప్రభుత్వ ఆధీనంలోకి చేరింది. ఒప్పంద గడువు ముగియకముందే 'లార్సెన్ అండ్ టూబ్రో' (L&T) సంస్థ ఈ ప్రాజెక్టు నుంచి వైదొలగడం, ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించడం నగర రవాణా చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచిపోనుంది.

**చారిత్రాత్మక ఒప్పందం: సచివాలయంలో ముగిసిన ప్రక్రియ**

హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (HMRL) ద్వారా ఎల్ అండ్ టీ మెట్రో రైలు లిమిటెడ్‌లో ఉన్న 100 శాతం ఈక్విటీని ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీనికోసం ప్రభుత్వం ₹1,461.47 కోట్లు వెచ్చించింది. రాష్ట్ర సచివాలయంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో హెచ్‌ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ ఉన్నతాధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సంతకాలతో దాదాపు 69.2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న మెట్రో నెట్‌వర్క్ నిర్వహణ, ఆస్తులు మరియు బాధ్యతలు ప్రభుత్వ నియంత్రణలోకి వెళ్లాయి.

కేవలం ఈక్విటీ కొనుగోలు మాత్రమే కాకుండా, ప్రాజెక్టుపై ఉన్న భారీ రుణభారాన్ని కూడా ప్రభుత్వం తన భుజాన వేసుకుంది. ఏప్రిల్ 30 నాటికి ప్రాజెక్టుపై ఉన్న ₹13,538.53 కోట్ల అప్పును ప్రభుత్వం తన గ్యారెంటీతో రీఫైనాన్స్ చేయాలని నిర్ణయించింది. ఈ ఆర్థిక లావాదేవీలన్నీ జూన్ 30 నాటికి పూర్తి కానున్నాయి.

**ప్రతిష్ఠాత్మక ప్రస్థానం: మాయటాస్ నుంచి ఎల్ అండ్ టీ వరకు**

హైదరాబాద్ మెట్రో ప్రయాణం పూల బాట ఏమీ కాదు. 2010లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదట 'మాయటాస్ ఇన్ఫ్రా' చేతికి దక్కింది. అయితే, సత్యం మిగతా 02లో

## వీహెచ్‌కు కీలక పదవి



- బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా వీహెచ్ నియామకం
- అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర మంత్రి సమాన హోదాలో ఈ పదవిలో వీహెచ్ నియామకం

10

**మే చివరి నాటికి**

## డబుల్ ఇండ్ల కేటాయింపు పూర్తి

ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష



- ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ లేదు
- సరిహద్దు వివాదాలకు స్వస్తి పలకాలి
- రెవెన్యూ, ఫారెస్టు జాయింట్ సర్వే

10

## రికార్డు కనిష్టానికి రూపాయి



- డాలర్‌తో పోలిస్తే రూ. 94.85కు చేరిన రూపాయి
- 0.32% పతనంతో కొత్త కనిష్టాన్ని తాకిన కరెన్సీ
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యల ప్రభావం తాత్కాలికమే

10



# కవితకు టీఆర్ఎస్ బ్రాండ్

## అధికారికంగా ఆమోదించిన ఎన్నికల సంఘం! తెలంగాణ రాజకీయాల్లో సంచలనం..

- పేరు మారింది, పోరు మొదలైంది
- కేసీఆర్ వారసత్వంపై కవిత ముద్ర..
- 'టీఆర్ఎస్' ఇప్పుడు కొత్త దిశలో
- బీఆర్ఎస్‌కు భారీ షాక్.. పాత పేరుపై హక్కు లేదు..
- 'తెలంగాణ రక్షణ సమితి'(టీఆర్ఎస్)గా కొత్త పార్టీ..
- కవిత స్ట్రాటజీ క్లియర్.. సెంటిమెంట్ బ్రాండ్‌తో ప్రజల్లోకి
- క్యాడర్‌లో గందరగోళం?.. బీఆర్ఎస్‌కు కఠిన పరీక్ష
- గ్రామీణ ఓటర్లపై ఫోకస్.. పాత గుర్తింపే కవిత ఆయుధం
- కాంగ్రెస్, బీజేపీకి సవాల్‌గా కవిత కొత్త అడుగు
- తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం..

**ముద్ర డెస్క్ :**

తెలంగాణ రాజకీయ యవనికపై ఒక సంచలనాత్మక మార్పు చోటుచేసుకుంది. దశాబ్దాల పాటు తెలంగాణ సెంటిమెంట్‌కు మారుపేరుగా నిలిచిన 'టీఆర్ఎస్' పేరు ఇప్పుడు సరికొత్త రూపంలో కొత్త నాయకత్వంలోకి వెళ్లడం రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు సారథ్యంలో ఉద్యమ కాలం నుండి అధికార పీఠం వరకు వెలిగిన ఈ పేరు, ఇప్పుడు ఆయన కుమార్తె, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హస్తగతమైంది.

**ముగిసిన సస్పెన్స్.. 'టీఆర్ఎస్' కవిత సొంతం**

గత కొంతకాలంగా కవిత తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే ఆమె కొత్త పార్టీని స్థాపించే దిశగా అడుగులు వేశారు. గత వారం ఆమె తన పార్టీ పేరును 'తెలంగాణ రాష్ట్ర సేన'గా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అయితే ఇప్పటికే 'బీఆర్ఎస్'గా ఉన్న గులాబీ పార్టీ నాయకత్వం ఈ పరిణామాలను తేలికగా తీసుకుంది. 'టీఆర్ఎస్' అనే పేరు ఇతరులకు కేటాయించడం సాధ్యం కాదని బీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తుంది. కానీ కేంద్ర ఎన్నికల సంఘం అనూహ్య నిర్ణయం తీసుకుంటూ కవిత దరఖాస్తును ఆమోదించింది. ఆమె పార్టీని అధికారికంగా 'తెలంగాణ రక్షణ సమితి' పేరుతో నమోదు చేస్తూ దానికి సంక్షిప్త నామంగా 'టీఆర్ఎస్'ను కేటాయించింది. దీనితో తెలంగాణ రాజకీయాల్లో అత్యంత శక్తివంతమైన బ్రాండ్ నేమ్ ఇప్పుడు కవిత ఖాతాలోకి చేరింది. మిగతా 02లో

## మంగ్లీ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

మంగ్లీ సోదరుడి ఖాతాకు డబ్బులు

02



# మేడే వర్ధిల్లాలి..

**చరిత్రలో ఈరోజు**



**ముద్ర డెస్క్ :**

'మే డే'. దీన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని కూడా పిలుస్తారు. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురైనప్పుడు ఏమవుతుంది..? శ్రామికుడు దోపిడీకి గురైనప్పుడు ఏం జరుగుతుంది..? కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయి.. భూకంపాలను తీసుకొస్తాయి.. ఉద్యమాలు పుట్టుకొస్తాయి.

కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన మిగతా 02లో

**ఇదీ AI ముద్ర**

తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసిన ఈ కూటమి ప్రభుత్వాన్ని ప్రజా స్వామ్య పద్ధతిలో కూలుస్తానని మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 01.05.2026
www.mudranews.in | @mudranews



### లవ్ ఫెయిల్



తక్షణ నిర్ణయాలు తీసుకోకండి.బ్రేకప్ తర్వాత వెంటనే పెద్ద నిర్ణయాలు (జాబ్ వదిలేయడం, నగరం మారడం) తీసుకోకండి.

# ‘మెట్రో’ ఎందుకు ఫెయిల్?

(మొదటి పేజీ తరువాయి)

కుంభకోణం కారణంగా ఆ ఒప్పందం రద్దయింది. తదనంతరం రంగంలోకి దిగిన ఎల్ అండ్ టీ, అసాధ్యమనుకున్న ఈ ప్రాజెక్టును సవాలుగా తీసుకుని పూర్తి చేసింది. 2017 నవంబర్ 29న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ మెట్రో, అనతి కాలంలోనే హైదరాబాద్ ఐకానిక్ గుర్తుగా మారింది. 3 కారిడార్లలో నిత్యం లక్షలాది మందిని గమ్యస్థానాలకు చేరుస్తూ రవాణా కష్టాలను తీర్చింది.

**పీపీపీ మోడల్ ఎందుకు భారమైంది?**

ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందినప్పటికీ, ఆర్థికంగా మెట్రో ఒత్తిడిని ఎదుర్కొంది. దీనికి ప్రధానంగా కొన్ని కారణాలు ఉన్నాయి.

**కోవిడ్ మహమ్మారి:** కరోనా లాక్‌డౌన్ సమయంలో మెట్రో సేవలు నిలిచిపోవడంతో ఆదాయం సున్నాకు పడిపోయింది. ఆ సమయంలో ఎదురైన నష్టాల నుంచి సంస్థ కోలుకోలేకపోయింది.

**రుణాల భారం:** ప్రాజెక్టు నిర్మాణం కోసం తీసుకున్న భారీ రుణాలపై వడ్డీలు కట్టడమే ఎల్ అండ్ టీకి భారంగా మారింది.

**తక్కువ రిడర్షిప్:** అంచనాల ప్రకారం రోజుకు 10 లక్షల మంది ప్రయాణిస్తారని భావించినా, అది 4.5 లక్షల దగ్గరే ఆగిపోయింది.




**ప్రభుత్వ సహకారం:** గతంలో ప్రభుత్వం ₹900 కోట్ల వడ్డీ లేని రుణం ఇచ్చినా, ఒప్పందాన్ని 2072 వరకు పొడిగించినా లాభదాయకత రాలేదు.

**ప్రభుత్వ నియంత్రణతో కలిగే ప్రయోజనాలు**

మొదటి దశ ప్రైవేట్ చేతిలో, రెండో దశ (విస్తరణ) ప్రభుత్వం చేతిలో ఉంటే సమన్వయ లోపం ఏర్పడుతుందని భావించిన ప్రభుత్వం, రెండింటినీ ఏకీకృతం చేయాలని నిర్ణయించింది. ఈ ‘టేకోవర్’ వల్ల ప్రయాణికులకు మరియు నగరానికి చేకూరే లాభాలు ఇవే.. మెట్రో ఛార్జీల పెంపుపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది, తద్వారా సామాన్యులకు భారం పడదు. ఎయిర్‌పోర్ట్ మెట్రో మరియు రెండో దశ పనులకు నిధుల సమీకరణ, అనుమతుల ప్రక్రియ సులభతరం అవుతుంది. ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్‌లతో మెట్రోను సమన్వయం చేయడం ద్వారా ‘సింగిల్ టికెట్’ ప్రయాణం సాధ్యమవుతుంది. మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్, ఫీడర్ సర్వీసులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉంది.

హైదరాబాద్ మెట్రో పీపీపీ మోడల్ ముగియడం అనేది ఒక వైఫల్యం కాదు, అది ఒక వాస్తవిక సర్దుబాటు. నగర రవాణా అనేది లాభాపేక్ష లేని సేవా రంగంగా ఉండాలని ప్రభుత్వం భావించడమే ఈ మార్పుకు మూలకారణం. ఎల్ అండ్ టీ శకం ముగిసినా, ప్రభుత్వ పర్యవేక్షణలో మెట్రో రైలు సరికొత్త వేగంతో దూసుకుపోతుందని నగరాసి ఆశిస్తున్నారు. సుమారు 86 కోట్ల ప్రయాణాలను విజయవంతంగా పూర్తి చేసిన మెట్రో, ఇకపై ప్రభుత్వ సారథ్యంలో మరింత మందికి చేరువ కానుంది.

# కవితకు ‘టీఆర్ఎస్’ బ్రాండ్..

(మొదటి పేజీ తరువాయి)

**బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ?**

జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలనే లక్ష్యంతో కేసీఆర్ తన పార్టీ పేరును ‘తెలంగాణ రాష్ట్ర సమితి’ నుండి ‘భారత రాష్ట్ర సమితి’ (బీఆర్ఎస్)గా మార్చారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మళ్లీ పాత పేరు (టీఆర్ఎస్) వైపు వెళ్తే బాగుంటుందని పార్టీలో అంతర్గత చర్చలు జరిగాయి. తెలంగాణ ప్రజలతో పెనవేసుకుపోయిన ఆ సెంటిమెంట్ పేరును మళ్లీ దక్కించుకోవాలని బీఆర్ఎస్ భావిస్తున్న తరుణంలో కవిత ఆ పేరును రిజిస్టర్ చేయించుకోవడం రాజకీయంగా పెద్ద ట్విస్ట్‌గా మారింది. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీకి పాత పేరును తిరిగి పొందే మార్గం పూర్తిగా మూసుకుపోయింది.

**కవిత వ్యూహం ఏమిటి?**

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. ఇది కేవలం పేరు మార్పు మాత్రమే కాదు.. తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద చీలికకు లేదా కొత్త ప్రత్యామ్నాయానికి సంకేతం అని చెప్పొచ్చు.. ‘టీఆర్ఎస్’ పేరుకు గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ తిరుగులేని గుర్తింపు ఉంది. కవిత ఈ పేరును వాడుకోవడం ద్వారా ప్రజల్లోకి సులభంగా వెళ్లవచ్చు. కవిత సొంతంగా పార్టీ పెట్టడం.. అది కూడా పాత పేరుతో రావడం వల్ల బీఆర్ఎస్ క్యాడర్‌లో గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా పోరాడుతూనే తన తండ్రి నిర్మించిన వారసత్వ బ్రాండ్‌ను తన ఖాతాలో వేసుకోవడం ద్వారా కవిత తన స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని చాటుకోవాలని చూస్తున్నారు.

తెలంగాణ సిద్ధాంతం, పోరాటం చుట్టూ తిరిగిన ‘టీఆర్ఎస్’ పేరు ఇప్పుడు కల్వకుంట్ల కవిత చేతిలో కొత్త ఆయుధంగా మారింది. ‘తెలంగాణ రక్షణ సమితి’ పేరుతో ఆమె ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. ఏది ఏమైనా రాజకీయాల్లో సుదీర్ఘ అధ్యాయం ముగిసి, ‘టీఆర్ఎస్’ పేరుతో కొత్త పోరాటం మొదలైందనేది వాస్తవం.




# మీ చట్టాలను మార్చండి

## 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసు: కేంద్రానికి తలంటిన సుప్రీంకోర్టు

**ముద్ర డెస్క్:**

దేశంలో అత్యాచార బాధితుల హక్కులు.. ముఖ్యంగా మైనర్ బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించి సుప్రీంకోర్టు గురువారం ఒక చారిత్రాత్మకమైన, సంచలనమైన వ్యాఖ్యలు చేసింది. 15 ఏళ్ల అత్యాచార బాధితురాలికి సంబంధించిన గర్భవిచ్ఛిత్తి (అబార్షన్) కేసును విచారించిన అత్యున్నత న్యాయస్థానం, మారుతున్న కాలానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తన పాత చట్టాలను పునఃసమీక్షించాలని, అవసరమైతే సమూల మార్పులు చేయాలని స్పష్టం చేసింది.

**కేసు నేపథ్యం.. కోర్టు అనుమతి**

కేసు వివరాల్లోకి వెళ్తే.. ఒక 15 ఏళ్ల బాలిక లైంగికదాడికి గురై సుమారు 30 వారాల గర్భంతో గర్భవిచ్ఛిత్తి కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. భారతీయ చట్టాల ప్రకారం, నిర్ణీత పరిమితి దాటిన తర్వాత గర్భవిచ్ఛిత్తికి న్యాయపరమైన అనుమతి తప్పనిసరి. ఈ క్రమంలో గత విచారణలో సుప్రీంకోర్టు స్పందిస్తూ, ‘ఒక మహిళను అందులోనూ ఒక మైనర్ బాలికను ఆమె ఇష్టానికి విరుద్ధంగా గర్భాన్ని కొనసాగించమని బలవంతం చేయడం అత్యంత అమానవీయం’ అని పేర్కొంటూ గర్భవిచ్ఛిత్తికి పచ్చజెండా ఊపింది.

**ఎయిమ్స్ అభ్యంతరం.. న్యాయస్థానం స్పందన**

అయితే ఈ తీర్పుపై ఢిల్లీలోని ఎయిమ్స్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ క్యూరేటివ్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఎయిమ్స్ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ.. 30 వారాల గర్భం అంటే అది దాదాపు పూర్తి స్థాయికి చేరుకున్నట్లేనని, ఈ దశలో అబార్షన్ చేయడం వల్ల బాలిక ప్రాణాలకే ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం నాలుగు వారాలు వేచి చూస్తే, బిడ్డకు జన్మనిచ్చి, ఆ తర్వాత ఆ శిశువును దత్తతకు ఇచ్చే వెసులుబాటు ఉంటుందని వారు సూచించారు.

ఈ వాదనలపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. కేవలం వైద్య పరమైన కోణంలోనే కాకుండా, బాధితురాలి మానసిక , సామాజిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ‘ఆ బాలిక ఎదుర్కొన్నది సాధారణ గర్భం కాదు, అది అత్యాచారం వల్ల కలిగిన ఫలితం. ఆ దారుణ ఘటన ఆమెను జీవితాంతం మానసిక క్షోభకు గురిచేస్తుంది. అటువంటి పరిస్థితుల్లో గర్భాన్ని మోయమని ఆమెను ఒత్తిడి చేయడం ఆమె ప్రాథమిక హక్కులను కాలరాయడమే అవుతుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**చట్టాల్లో మార్పులు అవసరం.. కేంద్రానికి సూచన**

ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత ఎంటీపీ యాక్ట్ లో ఉన్న నిబంధనలు అత్యాచార బాధితుల పట్ల కఠినంగా ఉన్నాయని అభిప్రాయపడింది. ముఖ్యంగా ప్రస్తుత చట్టంలోని 20 లేదా 24 వారాల గర్భవిచ్ఛిత్తి పరిమితిని, అత్యాచార బాధితుల విషయంలో ప్రత్యేక వెసులుబాటుతో పెంచేలా మార్పులు చేయాలి. గర్భవిచ్ఛిత్తి నిర్ణయం తీసుకునేటప్పుడు కేవలం శారీరక ఆరోగ్యాన్నే కాకుండా, బాధితురాలి మానసిక స్థితిని ప్రధాన ప్రాతిపదికగా తీసుకోవాలి. ఈ విషయంలో తుది నిర్ణయాన్ని బాధితురాలు ఆమె తల్లిదండ్రులకే వదిలేయాలని, వారికి తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది.

వైద్యుల నివేదిక ప్రకారం బాలిక ప్రాణాలకు ముప్పు లేదని నిర్ధారిస్తే ఆమె ఇష్టపూర్వకంగా గర్భవిచ్ఛిత్తి చేసుకోవచ్చని కోర్టు పునరుద్ఘాటించింది. దేశవ్యాప్తంగా మహిళల హక్కులు శరీర స్వయంప్రతిపత్తి పై సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు భవిష్యత్తులో చట్టపరమైన సంస్కరణలకు నాంది పలికేలా ఉన్నాయి. న్యాయవ్యవస్థ తీసుకున్న సాహసోపేత నిర్ణయంపై మహిళా హక్కుల సంఘాలు హర్షం తెలిపాయి.




# తిరుమలలో హీరో పెళ్లి

**ముద్ర డెస్క్ :**

టాలీవుడ్‌లో యంగ్ హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కొత్త జీవితాన్ని ప్రారంభించారు. బుధవారం రాత్రి ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమలలో, శ్రీ వేంకటేశ్వర స్వామి సాక్షిగా కావ్య రెడ్డితో ఆయన వివాహం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుక సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్త పద్ధతిలో నిర్వహించబడింది. కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరైన ఈ కార్యక్రమం చాలా ప్రశాంత వాతావరణంలో జరిగింది.

పెళ్లి వేడుకలో వధూవరులు సంప్రదాయ దుస్తుల్లో మెరిసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ శుభకార్యానికి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తోపాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు, సినీ ప్రముఖులు విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించారు. సినీ ఇండస్ట్రీకి చెందిన సన్నిహితులు కూడా ఈ వేడుకకు హాజరై కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రస్తుతం ఈ వివాహానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా కొత్త దంపతులకు శుభాకాంక్షలు వెల్లువెత్తిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కొత్త జీవితంలో సుఖశాంతులు కలగాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.ఇక సినిమాల విషయానికి వస్తే, పెళ్లి అనంతరం కూడా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన సినిమా ప్రాజెక్ట్‌లపై దృష్టి సారించనున్నట్లు సమాచారం. వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభించిన ఈ హీరో, కెరీర్‌లో కూడా మరిన్ని విజయాలు సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# మైక్రో ఫైనాన్స్ కేసు

## గాయని మంగ్లీ చుట్టు బిగుస్తున్న ఉచ్చు

## మంగ్లీ సోదరుడి ఖాతాకు డబ్బులు

**ముద్ర హైదరాబాద్ :**

గాయని మంగ్లీతో ముడిపడి ఉన్న మైక్రో ఫైనాన్స్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలించారు. రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి శివ అకౌంట్‌కు మూడు సార్లు డబ్బులు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే రమావత్ మధు బ్యాంకు ఖాతాలను పోలీసులు జప్తు చేశారు. మధు, హిమకాంత్‌రెడ్డి, శివ చౌహాన్‌ల బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వాలని బ్యాంకులకు లేఖ రాశారు.

మైక్రోఫైనాన్స్ పథకాల పేరిట అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి.. గాయని మంగ్లీ, ఆమె సోదరుడు సహా మరికొంతమంది రూ.కోట్లలో మోసగించారంటూ హిమకాంత్‌రెడ్డి తదితరులు తనను సంప్రదించారని సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావు ఇటీవల



తెలిపారు. ఈ విషయం గురించి తెలుసుకునేందుకు తాను మంగ్లీని సంప్రదించగా.. ఆమె బెదిరింపులకు పాల్పడినట్లు పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మంగ్లీ, ఆమె సోదరుడితోపాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగ్లీ సైతం సుబ్బారావుపై అదే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తనపై దుష్ప్రచారం చేసి.. సుబ్బారావు ప్రాచుర్యం పొందాలని చూస్తున్నట్లు ఆరోపించారు.

# మేడే వర్ధిల్లాలి..

(మొదటి పేజీ తరువాయి)

కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది.

భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది.

**మరికొన్ని ముఖ్య సంఘటనలు..**

2011: సెప్టెంబర్ 11 పేలుళ్ల సూత్రధారి ఒసామా బిన్ లాడెన్ హత్యకు గురైనట్లు ప్రకటించిన బరాక్ ఒబామా

1993: బాంబు పేలుడులో శ్రీలంక అధ్యక్షుడు రణసింగ్ ప్రేమదాస్ మరణం

1972: దేశంలోని బొగ్గు గనులను జాతీయం చేసిన ప్రభుత్వం

1961: క్యూబాను సోషలిస్టు దేశంగా ప్రకటించి ఎన్నికల ప్రక్రియకు స్వస్తి పలికిన క్యూబా ప్రధాన మంత్రి డాక్టర్ ఫిడేల్ కాస్ట్రో

1960: బొంబాయి రాజ్యం నుంచి విడివడి మహారాష్ట్ర, గుజరాత్ ఏర్పాటు

1913: నటుడు బాలరాజు సాహ్నీ జననం

1897: రామకృష్ణ మిషన్‌ను స్థాపించిన స్వామి వివేకానందుడు



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
01.05.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



లవ్ ఫెయిల్ : మీను మీరు తప్పపట్టుకోవద్దు

ప్రతి రిలేషన్ ఫెయిల్యూర్ మీ తప్పే కాదు. పరిస్థితులు, టైమింగ్ కూడా కారణం అవుతాయి.



## 32 ఏళ్ల పోలీస్ జీవితంలో..
## అనేక అనుభవాలు, జ్ఞాపకాలు : డీజీపీ శివధర్‌రెడ్డి

**ముద్ర, క్రైమ్ బ్యూరో ప్రతినిధి :**



32 ఏళ్ల పోలీస్ జీవితంలో అనేక అనుభవాలు, జ్ఞాపకాలు మిగిలాయని డీజీపీ శివధర్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాత పోలీసింగ్ విధానాలతో పోలిస్తే ఇప్పటి పరిస్థితుల్లో పెద్ద మార్పులు వచ్చాయన్న ఆయన, పోలీస్‌ప్రజల మధ్య దూరం తగ్గించేందుకు కృషి చేయాలని ఫ్రెండ్లీ పోలీసు విధానం తీసుకువచ్చామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీసులపై వచ్చిన అభిప్రాయాల మార్పు కోసం చర్యలు తీసుకున్నామన్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్ర డీజీపీగా అవకాశం ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన, కొత్త డీజీపీ సీవీ ఆనంద్‌కు అభినందనలు తెలిపారు.

**విశిష్ట సేవలు అందించారు: సీవీ ఆనంద్**

పదవీ విరమణ పొందిన శివధర్‌రెడ్డికి నూతన డీజీపీ సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు. శివధర్ రెడ్డి 32 ఏళ్ల పాటు ప్రజలకు విశిష్ట సేవలు అందించారన్న సీవీ ఆనంద్, నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో కీలకంగా పని చేశారని పేర్కొన్నారు. పోలీస్ కుటుంబాల కోసం సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. ప్రజలకు పోలీస్ శాఖపై మంచి సందేశం వచ్చే విధంగా ఉండాలని సూచించారు.

## గుజరాత్ పోలీసుల భారీ ఆపరేషన్

- హైదరాబాద్‌లో ఐవీఎఫ్ సెంటర్లపై సోదాలు
- చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ అరెస్ట్
- దేశవ్యాప్త నెట్‌వర్క్ బట్టబయలు
- ఏడాదిలో 25 మంది చిన్నారుల విక్రయం?
- దర్యాప్తులో సంచలన వివరాలు
- సికింద్రాబాద్, బంజారాహిల్స్, కూకట్‌పల్లి సెంటర్లపై ఫోకస్
- జైలు నుంచి బయటకు వచ్చాక మరింత విస్తరించిన గ్యాంగ్
- చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ అరెస్ట్



**ముద్ర, హైదరాబాద్ :**

హైదరాబాద్: చిన్నారుల అక్రమ రవాణా కేసులో సంచలన పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న మురుగన్‌ను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతనికి సంబంధాలున్న ఫెర్టిలిటీ సెంటర్లపై హైదరాబాద్‌లో విస్తృత సోదాలు నిర్వహించారు.ఈ క్రమంలో సికింద్రాబాద్‌లోని 49 ఐవీఎఫ్, బంజారాహిల్స్‌లోని హెగ్డే ఐవీఎఫ్, కూకట్‌పల్లిలోని నోవా ఐవీఎఫ్ సెంటర్లలో గుజరాత్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. మురుగన్ నెట్వర్క్‌తో ఈ సెంటర్లకు సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గత ఏడాది చైతన్యపురిలో వెలుగులోకి వచ్చిన కేసుతో మురుగన్ పేరు బయటపడింది. ఆ సమయంలో అరెస్టై మూడు నెలల పాటు జైలులో ఉన్న అతను, బయటకు వచ్చిన తర్వాత మరింత విస్తృతంగా అక్రమ కార్యకలాపాలు కొనసాగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక్క ఏడాదిలోనే దేశవ్యాప్తంగా నెట్వర్క్ ఏర్పరుచుకుని సుమారు 25 మంది చిన్నారులను విక్రయించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో పలువురు మధ్యవర్తులు, వైద్య రంగానికి చెందిన వ్యక్తుల ప్రమేయం ఉన్న అవకాశాలపై దర్యాప్తు జరుగుతోంది. ప్రస్తుతం మురుగన్ గ్యాంగ్ గుజరాత్ పోలీసుల అదుపులో ఉండగా, ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- విత్తనాల లభ్యతపై సచివాలయంలో మంత్రి తుమ్మల సమీక్ష

**ముద్ర హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని సచివాలయంలో ఈరోజు వ్యవసాయ రంగానికి సంబంధించిన కీలక సమీక్ష సమావేశాన్ని మంత్రి తుమ్మల నిర్వహించారు. ఈ సమావేశంలో సీడ్ కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో కంపెనీల వారీగా అందుబాటులో ఉన్న విత్తనాల లభ్యతపై మంత్రి తుమ్మల సమగ్రంగా ఆరా తీశారు. ఖరీఫ్ సాగు నాట్ల సమయానికి రైతులకు అవసరమైన విత్తనాలు ఎలాంటి లోటు లేకుండా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అదేవిధంగా, మార్కెట్‌లో నకిలీ విత్తనాల విక్రయాలను కట్టడి చేయడం అత్యంత కీలకమని పేర్కొన్న మంత్రి, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాల నియంత్రణ కోసం పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని ప్రత్యేక దళాలను ఏర్పాటు చేయాలని అధికారులకు మార్గదర్శనం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు సమయానికి అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.



# రైతులతో రాజకీయమా...?

- వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి
- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**

రైతులతో రాజకీయం చేసి గత ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయిందని ఇప్పుడు రేవంత్ సర్కార్ రైతులతో రాజకీయం చేయడం తగదని రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచందర్ రావు అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హనుమపురంలో జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బసవ లక్ష్మీ నరసయ్య తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో 20 రోజులుగా రెండు లారీలు మాత్రమే కొనుగోలు చేశారని ఈ కొనుగోలు కేంద్రంలో వందకు పైగా ధాన్యం కుప్పలు ఉన్నాయని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి కొనుగోలు కేంద్రాలలో పరిస్థితులు ఎలాగ ఉన్నాయో ఈ కొనుగోలు కేంద్రం లో ఉన్నటువంటి పరిస్థితులు అద్దం పడుతున్నాయని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు సబ్సిడీలో ఎరువులు విత్తనాలు అందజేసి రైతుల పక్షాన నిలబడింది గన్ని బ్యాగులు, సుతిలి, డబ్బడంతో సహా కేంద్ర ప్రభుత్వమే ఇస్తున్నప్పుడు రైతుల వద్ద ధాన్యాన్ని కొనడానికి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన నష్టం ఏంటి అని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే ధాన్యాన్ని కొనకుండా కేంద్ర ప్రభుత్వంపై బురద జల్లాలనే ప్రయత్నం మానుకొని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని లేనియెడల రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ పోరాటం చేయడానికి అయినా సిద్ధమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణ రెడ్డి, ఏలే చంద్ర శేఖర్, మాయ దశరథ, తుమ్మల మురళీధర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గూడూరు నార్రోతం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు కొప్పుల యది రెడ్డి, చందా మహేందర్ గుప్తా, కదూరి అచ్చయ్య, జిల్లా కార్యదర్శి మేడి కోటేష్, లక్ష్మీనారాయణ, జిల్లా మీడియా కన్వీనర్ ఆకుతోట రామకృష్ణ, కార్యాలయ కార్యదర్శి మంగు నరసింహారావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పక్కిర్ రాజేందర్ రెడ్డి, భువనగిరి మండల అధ్యక్షులు చిరిక సురేష్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కస్తూరి మాదిరి, కౌన్సిలర్ వంగేటి సూచేరితే, స్వర్ణలత, భోజన శారదా, మైనారిటీ మోర్చా రాష్ట్ర నాయకలు చంద్ పాషా, మహమూద్ పాల్గొన్నారు.



# దేశానికే ఆదర్శంగా అక్రెడిటేషన్లు

- మే10లోగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ అక్రిడిటేషన్లు
- మే1 అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ల పంపిణీకి ఆదేశం
- మే 15వరకు అందరికీ బస్సు పాస్‌ల పొడిగింపు
- సంఖ్య తేలితే జర్నలిస్ట్‌లకు మరిన్ని సౌకర్యాలు
- రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ముద్ర,హైదరాబాద్ :**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్ట్‌కు అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచన మేరకు పాత్రికేయులకు ఆరోగ్యంతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గురువారం సమాచార శాఖ ఆధ్వర్యాన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంత్రిగారు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులను ఇంతవరకు పొడిగించామని, దేశంలో, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరించాలన్న ఆలోచన మేరకు పరిశీలన సాగిందని అందువల్లే ఈ కార్డుల జారీలో ఆలస్యం చోటుచేసుకుందన్నారు. గత ప్రభుత్వం 32,500 మందికి అక్రిడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా 23,352 కే పరిమితం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు సుమారు 46 వేల మందికి పైగా అక్రిడిటేషన్లు ఇచ్చేలా మార్పులు చేసిందని తెలిపారు. ఇప్పటికే సుమారు 2800 వరకు కార్డులను ఆమోదించడం జరిగిందని వివరించారు. జర్నలిస్టుల సూచనల మేరకు జీవోలలో మార్పులు చేర్పులు చేశామని, అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరులో వెనకడుగు ప్రసక్తే లేదని అన్నారు. మే 1వ తేదీన అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ ప్రక్రియలో మే 10 వతేదీని ఒక కటాఫ్ డేట్‌గా పెట్టుకొని దరఖాస్తులు చేసుకోవాలని, ఆ తేదీలోగా వచ్చే దరఖాస్తులను ఆమోదించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్లు సంఖ్య తేలితే జర్నలిస్టులకు ఆరోగ్యం ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చునని అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఈ దిశగా పలు సూచనలు చేశారని వెల్లడించారు. అంతేగాక జర్నలిస్టులు వివిధ సంస్థలలో ఉద్యోగాలు మారినప్పటికీ అక్రిడిటేషన్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుందని ఈ విషయంలో ఎటువంటి సందేహాలు వద్దని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని త్వరలో పాత్రికేయ సంఘాలతో భేటీ అవుతామని తెలిపారు. ఏప్రిల్ 30తో కొంతమంది జర్నలిస్టుల బస్సు పాస్‌ల గడువు ముగుస్తున్నందున మరో 15 రోజుల పాటు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు

- సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, హైదరాబాద్:**

మే డే(మే 1వ తేదీ) సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వాములని... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

# వైభవంగా మహా పూర్ణాహుతి

- సహస్ర కలశాభిషేకం ఘటాభిషేకం
- లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు పరిసమాప్తి

**ముద్ర, యాదగిరిగుట్ట:**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన గురువారం ఉదయం స్వామివారి అలంకార సేవ నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం చేసి ద్వారా తోరణ పూజ మూర్తి కుంభారాధన చతు స్థానార్చన లక్ష్మి నృసింహ మూలమంత్రం గరుడ సుదర్శన మూల మంత్రం హోమములు నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం మాషబలి మహా పూర్ణాహుతి ఏ కొత్తర సహస్ర కలశాభిషేకం సహస్ర ఘటాభిషేకం నిర్వహించి నృసింహ ఆవిర్భావం స్వామివారికి మహా నివేదన తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. ఆలయంతో పాటు అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఉదయం ప్రాత రారా ధన యాగశాలలో చతుస్థానార్చన లక్ష్మీ నృసింహ సుదర్శన గరుడ మూల మంత్ర హోమములు మహా పూర్ణాహుతి అష్టోత్తర శతఘటభిషేకం నృసింహ ఆవిర్భావం మహా నివేదన తీర్థ ప్రసాద గోష్టి చేపట్టి జయంతి ఉత్సవాలకు ఆలయ అర్చకులు పరిసమాప్తపలికారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆలయ ఈవో భవాని శంకర్ ఆలయ చైర్మన్ నరసింహమూర్తి ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాందూరి వెంకటాచార్యులు సురేంద్ర చార్యులు ఉప ప్రధానార్చకులు శ్రీధరాచార్యులు మాధవాచార్యులు మంగళగిరి నరసింహమూర్తి, అర్చకులు సంపత్ కుమార్ చర్యలు కిరణ్ కుమార్ చార్యులు వినయ్ కుమార్ చార్యులు ఆదిత్యాచార్యులు సిద్ధార్థ చార్యులు శ్రీనాథ్ చార్యులు భరత్ కుమార్ చార్యులు సూపర్డెంట్ సురేందర్ రెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 30.04.2026
www.mudranews.in
@mudranews
mudratv



మీ 'ముద్ర' వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# మే డే వర్ధిల్లాలి..

– చరిత్రలో ఈరోజు



'మే డే'. దీన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని కూడా పిలుస్తారు. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురైనప్పుడు ఏమవుతుంది..? శ్రామికుడు దోపిడీకి గురైనప్పుడు ఏం జరుగుతుంది..? కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయి.. భూకంపాలను తీసుకొస్తాయి.. ఉద్యమాలు పుట్టుకొస్తాయి

కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్ లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది.

భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది.

## మరికొన్ని ముఖ్య సంఘటనలు..

**2011:** సెప్టెంబర్ 11 పేలుళ్ల సూత్రధారి ఒసామా బిన్ లాడెన్ హత్యకు గురైనట్లు ప్రకటించిన బరాక్ ఒబామా

**1993:** బాంబు పేలుడులో శ్రీలంక అధ్యక్షుడు రణసింగ్ ప్రేమదాస్ మరణం

**1972:** దేశంలోని బొగ్గు గనులను జాతీయం చేసిన ప్రభుత్వం

**1961:** క్యూబాను సోషలిస్టు దేశంగా ప్రకటించి ఎన్నికల ప్రక్రియకు స్వస్తి పలికిన క్యూబా ప్రధాన మంత్రి డాక్టర్ ఫిడేల్ కాస్ట్రో

**1960:** బొంబాయి రాజ్యం నుంచి విడివడి మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఏర్పాటు

**1913 :** నటుడు బాలరాజు సాహ్ని జననం

**1897:** రామకృష్ణ మిషన్‌ను స్థాపించిన స్వామి వివేకానందుడు

---

### సింహాచలం అప్పన్న స్వామికి

# చందనం ఎందుకు ప్రీతికరం





రెండు తెలుగు రాష్ట్రాలలో ఎంతో ప్రసిద్ధి చెందిన సింహాచలం అప్పన్న స్వామి మహిమల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.మన రాష్ట్రాలలో ఉన్న మిగతా నరసింహ స్వామి ఆలయాలలో కన్నా ఈ సింహాచలంలో ఉన్న ఆలయం ఎంతో భిన్నంగా ఉంటుంది.

అన్ని ఆలయాలలో మనకు స్వామి వారి విగ్రహ రూపంలో దర్శనమిస్తే సింహాచలంలో మాత్రం లింగరూపంలో భక్తులకు దర్శనమిస్తాడు. అదే విధంగా ఈ ఆలయంలో ఉన్న లింగరూప లక్ష్మీనరసింహస్వామి ఎల్లప్పుడు చందనంతో నిండుగా పూయబడి ఉంటుంది.

అసలు ఈ ఆలయంలో స్వామి వారు ఎందుకు లింగరూపంలో ఉన్నారు. ఇక్కడ ఉన్న స్వామివారికి చందనం ఎందుకింత ప్రీతికరమో ఇక్కడ తెలుసుకుందాం.

మన పురాణాల ప్రకారం విష్ణు భక్తుడైన ప్రహ్లాదుడు సింహాచలంలోని నవ నరసింహ స్వామిని ప్రతిష్టించాడని పురాణాలు చెబుతున్నాయి. రాక్షసుడైన హిరణ్యకశిపుడు స్తంభంలో స్వామివారిని చూపించమని స్తంభం పగల కొడుతున్న సమయంలో అందులో నుంచి విష్ణుమూర్తి నరసింహ అవతారంలో ప్రత్యక్షమై హిరణ్యకశిపుని సంహరిస్తానని మనకు తెలిసిన విషయమే.

ఈ విధంగా ప్రహ్లాదుడు తనకోసం ప్రత్యక్షమైన నారసింహుని మొట్ట మొదటగా సింహాచలంలో ప్రతిష్టించాడని పురాణాలు చెబుతున్నాయి.

సింహాచలంలో నరసింహ స్వామిని ప్రతిష్టించినది ప్రహ్లాదుడు అని పురాణాలు చెబుతున్నప్పటికీ ఆలయాన్ని నిర్మించినది మాత్రం పురూరవుడనే రాజు నిర్మించినట్టు శాసనాలు చెబుతున్నాయి.

ఒకరోజు పురూరవుడు సింహాచలం ప్రాంతాన్ని సందర్శించిన సమయంలో అక్కడ నేలలో కప్పబడి పోయిన స్వామి వారి విగ్రహం బయటపడింది. ఆ సందర్భంగా ఆ రాజు స్వామి వారి కోసం సింహాచలంలో ఆలయం నిర్మించారని తెలుస్తోంది.

అదే సమయంలోనే ఆకాశవాణి ఆ రాజుకు ప్రతి రోజు స్వామివారికి చందనం పూత పూయాలని చెప్పగా, ఆకాశవాణి పలుకుల మేరకు అప్పటి నుంచి స్వామివారిని నిత్యం చందనంతో అలంకరిస్తారు. అలా అప్పట్లో మొదలైన ఈ ఆచారం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

కేవలం ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే స్వామివారికి చందనం పూత ఉండదు. మిగిలిన రోజులన్నీ స్వామివారు చందనం పూతతోనే భక్తులకు దర్శనమిస్తారు.

---

# నిబద్ధతకు ప్రతిరూపం పుచ్చలపల్లి

**మే 1...పుచ్చలపల్లి సుందరయ్య జయంతి**

**ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, సమసమాజం కోసం పోరాడిన విప్లవకారుడు. కులవ్యవస్థను నిరసించి పేరులో కులాన్ని సూచించే పదాన్ని తొలగించుకున్న ఆదర్శవాది. ఉద్యమాల కోసం తన వాటా కింద వచ్చిన యావదాస్తిని ప్రజా పోరాటాల కోసం ఖర్చు చేసిన మార్గదర్శి.**

**ప్రజలకు, పార్టీకి పూర్తి కాలం ప్రజలకు, పార్టీకి సేవలు అందించాలనే ఉద్దేశంతో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న గొప్ప త్యాగశీలి. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట యోధుడు. ఇలా పేర్కొంటూ వెళితే, పేజీలు చాలవు. ఆయనే కామ్రేడ్ "పి.ఎస్". గా పిలువబడిన, "కమ్యూనిస్టు గాంధీ"గా పేరొందిన పక్కా కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య. ప్రపంచ కార్మిక దినోత్సవం రోజున జన్మించి, కమ్యునిజాన్ని ఔపోసన పట్టి, కన్ను మూసే వరకు ఆ భావజాలంలోనే కొనసాగిన పోరాట యోధుడు.**

పుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో ఒక భూస్వామ్య కుటుంబంలో 1913, మే 1 న జన్మించారు. తండ్రి వెంకటరామిరెడ్డి, తల్లి శేషమ్మ. తల్లి దండ్రులు సుందరరామిరెడ్డి అని పేరు పెట్టారు. ఆరేళ్ళ వయసులో తండ్రి మరణించగా, ప్రాథమిక విద్యను వీధి బడిలోనే, తరువాత తిరువళ్ళూరు, ఏలూరు, రాజమండ్రి, మద్రాసు లలో చదివారు.

గాంధీజీ నాయకత్వం పట్ల ఆకర్షితులై, సుందరయ్య 1930లో తన 17వ యేట ఉన్నత పాఠశాల రోజుల్లోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలలోను, ఉప్పు సత్యాగ్రహం లోను, సహాయ నిరాకరణోద్యమం లోను పాల్గొని కారాగార శిక్ష అనుభవించారు. అతనిని నిజామాబాద్, బోర్స్టల్ స్కూలులో ఉంచారు. ఆ సమయంలో ఆయనకు కమ్యూనిస్టులతో పరిచయం ఏర్పడింది. విడుదల అయినాక తన స్వగ్రామంలో వ్యవసాయ కార్మికులను సంఘటితం చేయడానికి కృషి చేశాడు. అమీర్ హైదర్ ఖాన్ స్ఫూర్తితో సుందరయ్య భారతీయ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అప్పటికి ఆ పార్టీ నిషేధంలో ఉంది. 1930 దశకంలో దినకర్ మెహతా, సజ్జద్ జహీర్, ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్, సోలీ బాట్లివాలా వంటి జాతీయ కార్య నిర్వాహక వర్గ సభ్యులైన ప్రముఖ కమ్యూనిస్టు నేతలతో చేరి సుందరయ్య క్రమంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యదర్శి అయ్యారు.

అమీర్ హైదర్ ఖాన్ అరెస్టు తరువాత దక్షిణాదిలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించే బాధ్యతను పార్టీ కేంద్ర కమిటీ సుందరయ్యకు అప్పగించింది. ఈ సమయంలోనే కేరళకు చెందిన నంబూద్రిపాద్, కృష్ణ పిళ్ళై వంటి నాయకులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీనుండి కమ్యూనిస్టు పార్టీలోకి మారారు. సుందరయ్య ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు శాఖను ప్రారంభించారు. ఇతర రాష్ట్రాలలో కమ్యూనిస్టు శాఖల ప్రారంభానికి కూడా స్ఫూర్తినిచ్చారు. 1936లో అఖిల భారత కిసాన్ సభ ప్రారంభించిన వారిలో సుందరయ్య ఒకరు. ఆ సభకు సంయుక్త కార్యదర్శిగా కూడా ఎన్నికయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటీషు ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించి నపుడు, 1939 నుండి 1942 వరకు, నాలుగేళ్ళు అజ్ఞాతంలో గడిపారు.



1943లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేశారు. బొంబాయిలో మొదటి పార్టీ కాంగ్రెస్ జరిగింది. తరువాత రెండవ పార్టీ కాంగ్రెస్ కలకత్తాలో జరిగింది. రెండుసార్లు కేంద్ర కమిటీ సభ్యునిగా సుందరయ్య ఎన్నికయ్యారు. కలకత్తా సమావేశంలో పార్టీ సాయుధ పోరాటంను సమర్థిస్తూ తీర్మానం చేసింది. దీనిని "కలకత్తా థీసిస్" అంటారు. అప్పటి సాధారణ కారదర్శి బి.టి.రణదివే ఈ తీర్మానాన్ని బలంగా సమర్థించారు. తత్ఫలితంగా కమ్యూనిస్టు కార్యకర్తలు ఆయుధాలను సమకూర్చుకోవడం ప్రారంభించారు. త్రిపుర, తెలంగాణ, తిరువాన్కురు ప్రాంతాలలో సాయుధ పోరాటాలు జరిగాయి. వీటిలో అత్యంత ప్రముఖమైనది నిజాం పాలన కాలంలో సాగిన తెలంగాణా సాయుధ పోరాట ఘట్టం. ఆ పోరాటానికి ముఖ్యమైన నాయకులలో సుందరయ్య ఒకరు. పోరాట చివరి దశలో 1948 నుండి 1952 వరకు సుందరయ్య అజ్ఞాతంలో గడిపారు. 1952 లో ప్రత్యేక పార్టీ సమావేశంలో మళ్ళీ కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. పార్టీ అత్యున్నత స్థాయి సంఘమైన "పొలిట్ బ్యూరో" సభ్యునిగా కూడా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన మూడవ పార్టీ కాంగ్రెసులోను, పాలక్కాడ్‌లో జరిగిన నాలుగవ పార్టీ కాంగ్రెసులోను కూడా కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు.




తరువాత అమృత్‌సర్‌లో జరిగిన ఐదవ పార్టీ కాంగ్రెస్‌లో సెంట్రల్ ఎక్జిక్యూటివ్ కమిటీకి సభ్యునిగా ఎన్నికయ్యారు. ఈ సమయంలోనే పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. 1962 లో చైనాతో భారతదేశం యుద్ధం సందర్భంగా, పార్టీ నాయకత్వంలో ఎస్.ఎ. డాంగే వర్గం భారత ప్రభుత్వాన్ని సమర్థించింది. అంతే కాకుండా చైనా, రష్యా విభేదాలు తలెత్తిన నేపథ్యంలో డాంగే వర్గం రష్యాకు అనుకూలమైన పంథాను సమర్థించింది. అయితే పి.సి.జోషి, రణదివే వంటి నాయకుల వర్గం ఈ విధానాన్ని రివిజనిస్టు మార్గంగా భావించింది.

డాంగే వర్గాన్ని లెఫ్టిస్టులనీ, రణదివె వర్గాన్ని రైటిస్టులనీ పిలిచారు.

లెఫ్టిస్టు వర్గంలో ఉన్న ప్రముఖ నాయకుడైన సుందరయ్య అమృత్‌సర్ సమావేశం సమయంలో పార్టీ నాయకత్వంలో అధికుల (డాంగే వర్గం) ధృక్పథాన్ని వ్యతిరేకిస్తూ, తన బాధ్యతలన్నింటికీ రాజీనామా చేశారు. 1962 నవంబరులో, చైనా యుద్ధం సమయంలో సుందరయ్యను అరెస్టు చేశారు.

"తెలంగాణా ప్రజల పోరాటం – దాని పాఠాలు" అన్న దికలో సుందరయ్య అప్పటి పరిస్థితులనూ, పార్టీ విధానాలనూ, పోరాట క్రమాన్నీ విశదంగా విశ్లేషించాడు. సుందరయ్య తయారు చేసిన ఈ నివేదికను భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 1972 డిసెంబరు నెలలో విడుదల చేసింది.

అక్టోబరు – నవంబరు 1964 లో జరిగిన 7వ పార్టీ కాంగ్రెస్‌లో భారతీయ కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. అందులో లెఫ్టిస్టులన బడేవారు భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పేరుతో క్రొత్త పార్టీగా ఏర్పడ్డారు. ఆ పార్టీకి సుందరయ్య సాధారణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సమావేశం జరిగిన కొద్ది కాలంలోనే భారత జాతీయ కాంగ్రెసు ప్రభుత్వం అనేక మంది సి.పి.ఐ–ఎమ్ నాయకులను అరెస్టు చేసిన సమయంలో సుందరయ్య మే 1966 వరకు నిర్బంధంలో ఉన్నారు.1975 – 1977 కాలంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని ప్రకటించినపుడు అరెస్టును తప్పించు కోవడం కోసం సుందరయ్య అజ్ఞాతంలోకి వెళ్ళారు.

1976 వరకు సుందరయ్య సి.పి.ఐ–ఎమ్ పార్టీ సాధారణ కార్యదర్శిగా కొనసాగారు. 1976 లో, ఎమర్జెన్సీ కొనసాగుతున్న సమయంలో, పార్టీలో "రివిజనిస్టు" భావాలను వ్యతిరేకిస్తూ సుందరయ్య సాధారణ కార్యదర్శి పదవికి, పొలిట్ బ్యూరో సభ్యత్వానికి రాజీనామా చేశారు.

1952 లో సుందరయ్య మద్రాసు నియోజక వర్గం నుండి పార్లమెంటు రాజ్యసభకు ఎన్నికయ్యారు. పార్లమెంటులో కమ్యూనిస్టు వర్గానికి నాయకుడయ్యారు. తరువాత రాష్ట్ర శాసనసభకు ఎన్నికై, 1967 వరకు శాసన సభా సభ్యునిగా కొనసాగారు. కొంత కాలం విరామానతరం 1978 లో శాసన సభకు ఎన్నికై, 1983 వరకు కొనసాగారు.

లీలా అనే సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగిని 1943 ఫిబ్రవరి 27న పార్టీ ప్రధాన కార్యదర్శి పీసీ జోషీ, మరికొద్ది మంది పార్టీ నేతల సమక్షంలో వివాహం చేసుకుని, 1944 చివర్లో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించు కోవడం ఆయన కుల పక్షపాత రాహిత్యాన్ని స్పష్టం చేస్తుంది.

తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడై, కుల వ్యవస్థను నిరసించిన పుచ్చలపల్లి సుందర రామిరెడ్డి...కులాన్ని సూచించే రెడ్డి తోక పదాన్ని పూర్తిగా తొలగించుకున్న ఆదర్శ మూర్తి.

పార్లమెంటు భవనానికి రాష్ట్ర విధానసభకు వెళ్ళినపుడు సైకిలును ఉపయోగించడాన్నిబట్టి ఆయన నిరాడంబరత తేటతెల్లం అవుతుంది. పేదరికం, దోపిడీ నుంచి పేదల విముక్తికి జీవితాన్ని అంకితం చేసిన సుందరయ్య 1985, మే 19న పుచ్చలపల్లి కన్నుమూశారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

---

# మన ధర్మంలో ముగ్గుకున్న ప్రాధాన్యత ఏమిటి ?

## ఏ ముగ్గును ఎక్కడ,ఎప్పుడు వేయాలి?

ఇంటి / గడప / గేటు ముందు ముగ్గులో భాగంగా గీసే రెండు అడ్డగీతలు ఇంటిలోనికి దుష్టశక్తులను రాకుండా నిరోధిస్తాయి. ఇంట్లో ఉన్న లక్ష్మీదేవి బయటకు వెళ్ళకుండా చూస్తాయి. ముగ్గువేసి దానికి నాలుగువైపులా రెండేసి అడ్డ గీతలు గీస్తే అక్కడ శుభాకార్యాలు, మంగళకరమైన పనులు జరుగుతున్నాయని గుర్తు. పండుగల సమయంలో ఈ విధంగా ఖచ్చితంగా వేయాలి. ఏ దేవతపూజ చేస్తున్నా దైవాన్ని ఉంచే పీట మీద మధ్యలో చిన్న ముగ్గు వేసినా, నాలుగు వైపులా రెండేసి గీతలను తప్పక గీయాలి. నక్షత్రం ఆకారం వచ్చేలా గీతలతో వేసిన ముగ్గు భూత, ప్రేత, పిశాచాలను ఆ దరిదాపులకు రాకుండా చూస్తుంది. అంతేకాదు, మనం వేసే పద్మాలు, చుక్కల ముగ్గులలో కూడా మనకు తెలియని అనేక కోణాలు దాగి ఉన్నాయి. అవి కేవలం గీతలే కాదు, యంత్రాలు కూడా.యంత్ర,తంత్ర శాస్త్ర రహస్యాలతో కూడి ఉండడం వలన మనకు హాని కలిగించే చెడ్డశక్తులను దరిచేరనీయవు.

## అందుకే ఏ ముగ్గునైనా తొక్కకూడదు.

తులసి మొక్క దగ్గర అష్టదళపద్మం వేసి దీపారాధాన చేయాలి. యజ్ఞయాగాదులలో యజ్ఞగుండం మీద నాలుగు గీతలతో కూడిన ముగ్గులేయాలి. దైవకార్యలలో కూడా నాలుగు గీతలతో కూడిన ముగులు వేయాలి. నూతన వధూవరులు తొలిసారి భోజనం చేసే సమయంలో వారి చుట్టుప్రక్కల లతలు, పుష్పాలు, తీగలతో కూడిన ముగ్గులు వేయాలి. దేవతా రూపాలను, ఓం, స్వస్తిక్, శ్రీ గుర్తులను పోలిన ముగ్గులు వేయకూడదు.

## ఒకవేళ వేసినా వాటిని తొక్కకూడదు.

ఏ స్త్రీ అయితే దేవాలయం లోనూ, అమ్మవారు, శ్రీ మహావిష్ణు ముందు నిత్యం ముగ్గులు వేస్తుందో, ఆ స్త్రీకి ఏడు జన్మలవరకు వైధవ్యం రాదని, సుమంగళిగానే మరణిస్తుందని దేవి భాగవతం, బ్రహ్మాండపురాణం చెబుతున్నాయి. పండుగ వచ్చిందా కదా అని, నడవడానికి చోటు లేకుండా వాకిలంతా ముగ్గులు పెట్టకూడదు.

## అంతేకాదండోయ్ !



మనం రోజూ ముగ్గులు వేయలేక పెయింటింగ్ వేస్తాం. దాన్ని ముగ్గుగా శాస్త్రం అంగీకరించదు. ఏ రోజుకారోజు బియ్యపు పిండితో ముగ్గు పెట్టాలి. నిత్యం ఇంటి ముందు, వెనుక భాగంలో, తులసి మొక్క దగ్గర, దీపారాధన చేసే ప్రదేశంలో ముగ్గు వేయాలి. ముగ్గు పాజిటివ్ / దైవ శక్తులను ఇంట్లోకి ఆకర్షిస్తుంది. ముగ్గులు ఒకప్పుడు సూచకాలుగా పనిచేసేవి.పూర్వం రోజూ సాధువులు, సన్యాసులు, బ్రహ్మచారులు ఇల్లిల్లూ తిరిగి బిక్ష అడిగేవారు. ఏ ఇంటి ముందైనా ముగ్గు లేదంటే ఆ ఇంటికి వేళ్ళేవారు కాదు. వారే కాదు అడ్డుక్కునే వారు కూడా ముగ్గు లేని ఇళ్ళకు వెళ్ళి అడ్డుక్కునే వారు కాదు.

## ముగ్గు లేదంటే అక్కడ అశుభం జరిగిందని గుర్తు.

అందుకే మరణించినవారికి శ్రాద్ధకర్మలు చేసే రోజున ఉదయం ఇంటిముందు ముగ్గు వేయరు. ముగ్గులు వెనుక సామాజిక, మానసిక, ఆరోగ్య, ఆధ్యాత్మికమైన అనేక రహస్య కోణాలు దాగి ఉన్నాయి. మన ఆచరించే ఏ ఆచారమూ మూఢనమ్మకం కాదు.

**మన ఆచార, సంప్రదాయాలన్నీ అనేకానేక అర్థాలు, పరమార్థాలతో కూడినవి.**

**లవ్ ఫెయిల్ :**

ఒంటరిగా కాకుండా ఫ్రెండ్స్, ఫ్యామిలీతో టైమ్ గడపండి. ఒంటరితనం డిప్రెషన్‌కు దారి తీస్తుంది.



## సంక్షిప్తంగా..

### నేడు హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



**ముద్ర, కుషాయిగూడ:** కుషాయిగూడలో శుక్రవారం 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. స్థాపిత దేవతార్చన, స్థాపిత దేవత (మన్యు సూక్త) హోమా లు, ఔషదీ యుక్త మహా స్నాపనం, ధ్యానాదివాసం, హారతి, సుదర్శన హోమం కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో సుమారు 19 జంటలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాసవి మిత్రమండలి నేతృత్వంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు నాగర్ కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కామర్స్ కళాశాల విద్యార్థుల మూడు పరిశోధన ప్రాజెక్టులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. కె. గీతాంజలి తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. అర్థశాస్త్ర విభాగానికి చెందిన డా. రాత్లావత్ కృష్ణ, చరిత్ర విభాగం నుంచి డా. ఎం. రవీందర్, ఉర్దూ విభాగం నుండి రిజ్వానా పర్యవేక్షణలో రూపొందించిన మూడు పరిశోధన ప్రాజెక్టులు ఈ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జిజ్ఞాస ప్రాజెక్టుల సమన్వయకర్త రాత్లావత్ కృష్ణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ఎస్సీ కార్పొరేషన్ పథకాల కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కోసం శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు.ఈ ఇంటర్వ్యూలు ఈవీ టూ వీలర్, త్రీ వీలర్, పాలిచ్చే పశువులు (మిల్చ్ అనిమల్స్) పథకాల కోసం నిర్వహించబడనున్నాయని ఆయన పేర్కొన్నారు. సంబంధిత పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతులు రెండు సెట్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల (కాస్ట్), ఆదాయ (ఇన్‌కమ్) సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు వెంట తీసుకురావాలని సూచించారు.

### స్వీయ జనగణనపై అవగాహన ఉండాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయి బృందం నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ డీసీఓ ఎగ్జిక్యూటివ్ రిషిత్ రెడ్డి, ఎన్ఐసీ కోఆర్డినేటర్ హర్షద్, టీపీ శ్రావణ్ పాల్గొన్నారు. వారు అడిషనల్ ఎస్పీకి స్వీయ జనగణన ప్రక్రియను ప్రత్యక్షంగా చూపించి, దానిని ఎలా పూర్తి చేయాలో వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా స్వీయ జనగణనలో ప్రజలు స్వయంగా నమోదు చేసుకునే విధానంపై వివరాలు అందించారు. ఇందులో భాగంగా పోస్టర్‌ను జిల్లా అడిషనల్ ఎస్పీ సమక్షంలో విడుదల చేశారు. కార్యక్రమం ద్వారా అవగాహన పెంపొందించడం ముఖ్య ఉద్దేశంగా అధికారులు తెలిపారు.

# సోమశిలను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలి

**కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** గర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం సోమశిలను రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక ప్రదేశాల్లో ఒకటిగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. గురువారం సోమశిలను స్వయంగా సందర్శించి అక్కడ కొనసాగుతున్న పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సోమశిలలో అమలవుతున్న ఎకో టూరిజం ప్రాజెక్టులు, హెలీ టూరిజం, పర్యాటకులకు అందిస్తున్న సౌకర్యాలు, అలాగే 167కే జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న ఐకానిక్ కేబుల్ వంతెన పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి సోయగాలతో ప్రసిద్ధి చెందిన సోమశిలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తే రాష్ట్రానికి ప్రముఖ టూరిజం హబ్‌గా ఎదిగే అవకాశముందని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే సోమశిల దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే పర్యాటక కేంద్రంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పర్యాటకులకు సరికొత్త అనుభూతి కలిగేలా అభివృద్ధి పనులకు వేగం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నల్లమల అరణ్యాలు, కృష్ణా నది ప్రవాహం, శ్రీశైలం బ్యాక్‌వాటర్స్, అడవుల పచ్చదనం వంటి సహజ సౌందర్యాన్ని పర్యాటకులు ఆస్వాదించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొంటూ, అధికారులు కూడా సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటకులకు అవసరమైన ప్రాథమిక వసతులు, నివాస సదుపాయాలు, భద్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అదేవిధంగా, సోమశిల వద్ద కృష్ణా నదిపై నిర్మాణంలో ఉన్న ఐకానిక్ కేబుల్ వంతెన పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. 167కే జాతీయ రహదారి భాగంగా నిర్మిస్తున్న ఈ వంతెన పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు సోమశిల పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ పర్యటనలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా టూరిజం అధికారి నరసింహాతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తా

**మాజీమంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**



**ముద్ర, కాప్రా:** దమ్మాయిగూడలో డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా ప్రజలు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని గురువారం మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్ల కింద కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ కు 350 ఎకరాలు కేటాయించి జవహర్ నగర్, దమ్మాయిగూడ, నాగారం, రాంపల్లి పరిసర ప్రాంతాలను సర్వనాశనం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు తాను మంత్రిగా ఉన్నన్ని రోజులు డంపింగ్ యార్డ్ నుంచి వాసన మురుగునీరు రాకుండా రూ.150 కోట్లతో క్యాపింగ్ తో పాటు 500 కోట్లతో పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసి కరెంటు ఉత్పత్తి అయ్యేలా ఏర్పాటు చేశామని, డంపింగ్ యార్డ్ వలన చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సిటీ నుండి వచ్చే చెత్తను నాలుగు దిక్కుల పంపించేందుకు అన్ని ఏర్పాట్లు కూడా చేశామని, దానికి సంబంధించి నాలుగు ప్రాంతాలలో నాలుగు డంపింగ్ యార్డులకు ప్లేస్ కూడా గుర్తించా మని అన్నారు. వాటన్నింటినీ తుంగలో తొక్కి రెండున్నరేళ్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, కోర్టులు కూడా ఎన్నిసార్లు మొట్టికాయలు వేసిన డంపింగ్ యార్డ్ యాజమాన్యం పట్టించుకోకుండా రూల్స్ కు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు రోజుల్లో మంత్రి శ్రీధర్ బాబును కలిసి డంపింగ్ యార్డ్ వలన ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని మంత్రి కి మెమోరాండం ఇవ్వడానికి వెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇకనుంచి ప్రజలకు మద్దతుగా, డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా మా పోరాటం ఉంటుందని ఆయన అన్నారు

# సైబర్ మోసాలు - బాల్యం భద్రం




**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మాహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం గట్టు మండలం గోర్లఖాన్ దొడ్డి గ్రామంలోని రైతు వేదికలో సైబర్ నేరాలు, పిల్లల భద్రత, రక్షణ మరియు అనాథ పిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు అదనపు జిల్లా కలెక్టర్ నర్సింగ్ రావు మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలతో విద్యను మధ్యలో ఆపకూడదని, చదువే భవిష్యత్తుకు పునాది అన్నారు. రాబోయే తరాలు బలంగా ఎదగాలంటే, దేశం అభివృద్ధి చెందాలంటే విద్య ఒక్కటే మార్గమని తెలిపారు. అలాగే, బాలికలు ఎలాంటి అవాంఛనీయ ప్రభావాలకు, ఆకర్షణలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక నష్టాలు కలుగుతాయని, అలాంటి వివాహాలు నిర్వహించిన తల్లిదండ్రులు, బంధువులు, పురోహితులు, టెంట్ హౌస్ నిర్వాహకులు, సరఫరాదారులు, ఫోటోగ్రాఫర్లు సహకరించిన వారందరూ చట్టపరమైన చర్యలకు లోనై జైలు శిక్షను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. బాల్య వివాహాలతో శారీరక, మానసిక ఎదుగుదల కుంటుపడుతుందని దీని ప్రభావం రాబోయే తరాల పైన, దేశ ఆర్థిక వ్యవస్థ పైన ప్రభావం చూపుతుందన్నారు, చరవాణి వినియోగాన్ని అవసరానికి తగిన విధంగా వాడడం వలన మోసాలను అరికట్టవచ్చని, ప్రలోభాలకు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా బాలల సురక్షిత–అసురక్షిత పరిస్థితుల పైన, బాలల సంరక్షణపై, దురలవాట్లను దరి చేయనీయకుండా ఉండడంపై వీడియోలు ప్రదర్శించారు. అనాథ, నిరాధార విడిచిపెట్టబడిన పిల్లల వివరాలను సేకరించి, వారికి విద్యలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. జిల్లా మహిళా, శిశు అభివృద్ధి అధికారి సునంద, ఎంపీడీవో చెన్నయ్య, డీసీపీఓ నరసింహ, ఎస్సై శేఖర్ గౌడ్, సర్పంచ్ శ్వేత, పంచాయతీ కార్యదర్శి రవి, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ కిరణ్, చైల్డ్ లైన్ సూపర్వైజర్ నవీన్, హబ్ కోఆర్డినేటర్ సరోజ పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** జిల్లాలో విద్యా వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 11 నుంచి 26 వరకు నిర్వహించనున్న విద్యా వారోత్సవాలను ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగిత రాణా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లతో విద్యా వారోత్సవాలపై సమీక్ష నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లల గుర్తింపు, "బడిబాట" కార్యక్రమం, పదో తరగతి విద్యార్థులకు కెరీర్ మార్గదర్శక కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ బడి బయట ఉన్న ప్రతి బాలుడిని గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యా వారోత్సవాల విజయవంత నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, వెంకటయ్య, నూరుద్దీన్, షర్ఫుద్దీన్, ఐడబ్ల్యూడీసీ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**గద్వాల నుంచి..**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. విద్యాశాఖ అధికారులతో కలిసి ఇటీవల తాను ఫిన్లాండ్ వెళ్లిన అనుభవాలను కలెక్టర్ తెలియజేశారు. ఫిన్లాండ్ దేశంలో అనుసరిస్తున్న విద్యా వ్యవస్థను స్ఫూర్తిగా తీసుకుని జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఇఓ విజయలక్ష్మి , సెక్టోరియల్ అధికారి మైఖేల్, టిజి ఈడబ్ల్యూఐడిసి ఏఈలు మోహన్ రెడ్డి, ఆజాం, తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ పోలీసు అధికారులకు సన్మానం



**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ లో సేవలందిస్తూ పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులను కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్లు కె. కరుణాకర్ రెడ్డి, బండయ్య, బి. కిష్టయ్యలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి అడ్మిన్ డీసీపీ శివ కుమార్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అనేది ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ దీర్ఘకాలం పాటు క్రమశిక్షణతో, నిబద్ధతతో సేవలందించిన ఈ అధికారులు అభినందనీయులని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఏవో అడ్మిన్ శ్రీనివాస్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఏఎస్ఐకి సన్మానం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ఊరుకొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ ఎం.డి. అబ్దుల్ గఫార్ రిటైర్మెంట్ పొందిన సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ రిటైర్మెంట్ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఒక ముఖ్య దశ అని, సేవాకాలంలో చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆయురారోగ్యాలతో శేష జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏవో కృష్ణయ్య, డీసీఆర్‌బీ ఎస్ఐ రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ తాజుద్దీన్, జిల్లా పోలీస్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు ఏఎస్ఐ గుణవర్ధన్, కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కంటి చికిత్స శిబిరం విజయవంతం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరం విజయవంతమైంది. పాత కలెక్టరేట్ కార్యాలయంలో శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవికుమార్ నాయక్ ప్రారంభించారు. కంటి గాయాలు, వయో భారంతో కంటిలో శుక్లాలు (క్యాటరాక్ట్) ఏర్పడతాయని తెలిపారు. ముఖ్యంగా వృద్ధుల్లో శుక్లాల కారణంగా తాత్కాలిక అంధత్వం ఏర్పడే అవకాశం ఉందన్నారు. శస్త్రచికిత్స ద్వారా ఐఓఎల్ అమర్చడం వల్ల ఈ సమస్యను సులభంగా నివారించవచ్చని వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కంటి శుక్లాల అనుమానం ఉన్న వారిని గుర్తించి, జిల్లా స్థాయిలో నిర్వహించే కంటి పరీక్షా శిబిరాలకు తరలించాలని సూచించారు. ఈ శిబిరంలో మొత్తం 91 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అర్హులైన 37 మందికి రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేసి, తదుపరి శస్త్రచికిత్స కోసం మహబూబ్‌నగర్‌లోని ఎనుగొండలో ఉన్న లయన్స్ రాం రెడ్డి కంటి ఆసుపత్రికి ప్రత్యేక అంబులెన్స్ ద్వారా తరలించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి కొత్ర బాలాజీ, హెల్త్ ఎడ్యుకేటర్ నర్సింహ, ఆరోగ్య సిబ్బంది వై. శ్రీనివాసులు, సుకుమార్ రెడ్డి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

## లోపాలను తొలిదశలోనే గుర్తించాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** జిల్లాలో ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల్లో శారీరక, మానసిక అభివృద్ధి లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వెంటనే తగిన చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె. రవికుమార్ సూచించా రు.ఆర్‌బీఎస్‌కే సంచార వైద్య బృందాల ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాల పరిధిలో చిన్నారులను పరీక్షిస్తూ, అంగవైకల్యాలు, శారీరక–మానసిక పెరుగుదలలో లోపాలు, అభివృద్ధి ఆలస్యాలను గుర్తించే బాలభరోసా వైద్య శిబిరాన్ని గురువారం జిల్లా కేంద్రంలోనీ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వైద్య నిపుణులు అసోసియేట్ ప్రొఫెసర్ డా. మహ్మద్ సిరాజుద్దీన్, డా. నాజీమోద్దీన్ ఎంపిక చేసిన 16 మంది చిన్నారులను పరీక్షించారు. అనంతరం చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరి, సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా. రవిశంకర్, డా. రోహిత్, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా. సురేష్, డా. అక్బర్ దురాని, సీపీఓ శ్రీశైలం, హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ, సీహెచ్‌ఓలు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, కళ్యాణ్ కృష్ణ పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో కేజీబీవీల సత్తా

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాలు పదో తరగతి ఫలితాల్లో మరోసారి అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు డీఈవో ఏ. రమేష్ కుమార్ వెల్లడించారు. గురువారం డీఈఓ కార్యాలయంలో కేజీబీవీల పర్యవేక్షణ అధికారి శోభారాణి, ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు కలిసి కేక్ కట్ చేసి విద్యార్థినిల విజయాన్ని జరుపుకున్నారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో 20 కేజీబీవీలలో 19 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషమన్నారు. మొత్తం 921 మంది విద్యార్థినిలు పరీక్షలకు హాజరుకాగా, 920 మంది ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు. ఈ ఫలితాలతో రాష్ట్రస్థాయిలో నాగర్‌కర్నూల్ కేజీబీవీలు ద్వితీయ స్థానం సాధించాయని తెలిపారు. విద్యార్థినిల ప్రతిభను వివరిస్తూ, 450 నుండి 500 మార్కుల మధ్య 650 మంది, 500 నుండి 550 మార్కుల మధ్య 250 మంది విద్యార్థినిలు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఇది విద్యార్థినిల కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత, పాఠశాలల నాణ్యతకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు.ఈ విజయానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు చేపట్టిన చర్యలు దోహదపడ్డాయని తెలిపారు. ప్రత్యేక శిక్షణ తరగతులు, మోడల్ పరీక్షలు, రివిజన్ సెషన్లు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. అలాగే కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు లక్ష్యసాధనలో దిశానిర్దేశం చేశాయని చెప్పారు. ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ కసిరెడ్డి నారాయణరెడ్డి విద్యార్థుల చదువు పురోగతిని సమీక్షించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం 99.89గా నమోదైందని తెలిపారు. కార్యాలయ పర్యవేక్షకులు సుజాత తిరుపతమ్మ, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, బరపటి వెంకటయ్య, నూరుద్దీన్, షర్ఫుద్దీన్, వెంకటేశ్వర్లు శెట్టి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 01.05.2026
www.mudranews.in | @mudranews



**లవ్ ఫెయిల్:**

స్టాకింగ్ తగ్గించండి ఎక్స్ గురించి పదే పదే చూసుకుంటే మానసికంగా ఇంకా హర్ట్ అవుతారు.



# రైతులకు ఇబ్బందులు కలగొద్దు

**-ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి**
**-వన మహోత్సవం విజయవంతం చేయాలి**
**-మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర, కరీంనగర్:**
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం కరీంనగర్ జిల్లాలోని చిగురు మామిడిలో ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, బడిబాట వన మహోత్సవం తదితర అభివృద్ధి కార్యక్రమాల పై అధికారులతో సమీక్షా చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిగురు మామిడి మండలం లోని 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జీపీవో, గ్రామ కార్యదర్శి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులకు టర్పాలిన్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద లారీ ల సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిగురు మామిడి మండలంలో వేసవి కాలంలో తాగునీటి సరఫరా లో సమస్యలు రాకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. దొంతులపల్లి లో తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్ సమస్యల్లో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పాత బావులు పూడికతీత చేసి ఉపయోగించుకోవాలని సూచించారు. సుందరగిరి లో ఇప్పటికే వేసిన బోరు కి మోటార్ కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడం పై విద్యుత్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నీటి వనరులు ఉన్న బావుల నుంచి పైప్ లైన్ ద్వారా నీరు సరఫరా చేయాలని తెలిపారు. కొత్తపల్లి – హుస్నాబాద్ మధ్య నిర్మిస్తున్న నాలుగు లేన్ రోడ్డు లో పైప్ లైన్ ఎందుకు షిఫ్ట్ చేయలేదని అధికారులను ప్రశ్నించారు. రాజీవ్ రహదారి కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ మధ్య జరుగుతున్న నాలుగు లైన్ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలం వస్తే ఆటంకాలు అవుతా యన్నారు.

**పాఠశాలల్లో మౌలిక వసతులు..**

బడి బాట ద్వారా ఇంటింటికి తిరిగి పిల్లలు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అన్ని పాఠశాలలకు పెయింట్స్ వేయడంతో పాటు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మండలంలో ఒక్కో విద్యార్థికి ఉపాధ్యాయునికి నిష్పత్తి తక్కువగా ఉందని, విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. చాలా గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రతిజ్ఞ చేస్తున్నారని, ఈసారి ప్రీ ప్రైమరీ నుంచి విద్యార్థులపై ఫోకస్ చేయాలన్నారు. స్వయంగా బడి బాట కార్యక్రమంలో తాను పాల్గొంటానని మంత్రి వెల్లడించారు.

**80 వేల మొక్కలు నాటాలి..**

మండలంలో ఈసారి వన మహోత్సవం ద్వారా 80 వేల మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశామని, వారి సహకారంతో మొక్కలు నాటాలన్నారు. మండలంలో కొత్త రోడ్లు పూర్తయిన ప్రాంతాల్లో ఇరువైపుల మొక్కలు నాటాలని ఆదేశించారు. మండలంలో 341 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 42 మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. జూన్ 2 లోపు భారీగా ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం జరగాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించడానికి హార్టికల్చర్ అధికారులు రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి సర్పంచ్ 50 ఎకరాల్లో రైతులు ఆయిల్ ఫాం సాగు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ లూస్ కేబుల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. మండలంలో ప్రతి గ్రామాల్లో హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి పోలీసులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిష నల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మా ర్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, డీపీఓ జగదీశ్వర్, డిఆర్డీఓ శ్రీధర్, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులివ్వాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లాలోని అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండూరు రవీందర్, వెంకగారి భూమయ్య కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచి, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో ఎంతో కష్టపడి పనిచేస్తున్న జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు (అక్రిడిటేషన్లు) ఇవ్వడంలో జాప్యం చేయడం తగదన్నారు. అలాగే సొంత ఇల్లు లేక ఆర్థిక ఇబ్బందులతో అద్దె ఇళ్లలో నివసిస్తున్న జర్నలిస్టుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా ఇళ్ల స్థలాలు కేటాయించి, వారి సొంతింటి కల సాకారం చేయాలని కోరారు. విద్యా రంగంలో పెరుగుతున్న భారాన్ని దృష్టిలో ఉంచుకుని, జర్నలిస్టుల పిల్లలు చదువుకునే ప్రైవేట్ పాఠశాలల్లో పూర్తి ఫీజు రాయితీ కల్పించేలా జిల్లా యంత్రాంగం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పూసల పోశెట్టి, గుమ్ముల అశోక్, జల్ల మనోజ్, కార్యదర్శులు సట్ల హనుమాండ్లు, రాజేశ్వర్, డీఎస్ మధు, వరప్రసాద్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహ జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా భక్తులు ఎక్కువ సంఖ్యలో నవగ్రహ పూజా, సంతాన గోపాల హోమ పూజా కార్యక్రమల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నంబి వేణుగోపాలాచార్య, కౌశిక, నంబిరాం గోపాల చార్య, నంబి సత్యనారాయణ ఆచార్య, నంబి మధుసూదన్ ఆచార్య, నంబి నృసింహ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను కలిసిన టీఎన్ జీఓ నేతలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ జిల్లా కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన భవేష్ మిశ్రా ను టీఎన్ జీఓ నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధిలో తమ వంతు బాధ్యతను నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా వారిని కోరారు.

## కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు తక్షణమే పదేకరాల స్థలాన్ని కేటాయించాలని బీజేపీ నాయకురాలు డాక్టర్ బోగ శ్రావణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ఆమె విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం మంజూరు చేసిన నవోదయ విద్యాలయం కోరుట్లలో పూర్తయిందని తెలిపారు. కాని జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ (వాలంతరి) వద్ద కేంద్రియ విద్యాలయానికి స్థలం కేటాయించడంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో జిల్లా మంత్రి వెంటనే స్పందించి తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఈ నెల 15 లోపు స్థలం కేటాయించకపోతే, ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎంపీ అర్వింద్ నిరాహార దీక్ష చేస్తారని హెచ్చరించారు. బీజేపీ నాయకులు కొక్కు గంగాధర్, శ్రీనివాస్ తదితర నేతలు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్:**
రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడి వారి ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. .రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా రుణ మాఫీ, రైతు భరోసా, సన్నాలకు బోనస్ వంటివి చెల్లిస్తూ అనేక రకాలుగా రైతులను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో రమేష్, కార్పోరేటర్లు గాదె రూప శ్రీనివాస్, మేకల వెంకటేష్, నాయకులు కాంరెడ్డి రాంరెడ్డి, బీరం ఆంజనేయులు, కపిల్ మాధవ్, శ్రీధర్ రెడ్డి, రాజిరెడ్డి, వెంకటేష్, సాయిని తిరుపతి, శ్రీనివాస్ పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

**- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా**



**బోథ్, ముద్ర:**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం గాదిగూడ మండలంలోని పిప్రి (కొలంగూడ) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న పలు ఇళ్లను స్వయంగా సందర్శించిన కలెక్టర్, పనుల నాణ్యతను తనిఖీ చేశారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ ప్రక్రియలో ఎక్కడా నాణ్యత లోపించకూడదని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్య వేక్షిస్తూ లబ్ధిదారులకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా బిల్లుల చెల్లింపు విషయంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగొద్దని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే దశల వారీ గా ఎంబీ రికార్డు చేసి, త్వరిత గతిన నిధులు విడు దలయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు స్పష్టమైన ఆదే శాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కాల నీల్లో కేవలం గృహ నిర్మాణమే కాకుండా, విద్యుత్, తాగునీరు, మురుగు నీటి కాలువల వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు, లబ్ధిదారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగ వంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన సంస్కృతిని కాపాడుకుందాం




**బోథ్, ముద్ర:** గిరిజన సంస్కృతిని కాపాడుకుందామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం నార్నూర్ మండలం జామిడి గ్రామంలో జరిగిన తొమ్మిదో ఇప్ప పువ్వు పండుగ, అనాథ పిల్లల సంక్షేమ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ఆర్థిక వ్యవస్థలో ఇప్ప పువ్వు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. దీనిని శాస్త్రీయ పద్ధతిలో సేకరించి విక్రయించి గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈలాంటి ఉత్సవాలు గిరిజన సంస్కృతిని భావితరాలకు అందిస్తాయని పేర్కొన్నారు. ఐటీడీఏ ద్వారా రైతులు, స్వయం సహాయక సంఘాలకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డీసీపీయూ సర్వే – చట్టబద్ధమైన దత్తత పై అవగాహన కల్పించారు. జిల్లాలోని అనాథలు, వీధి బాలలను గుర్తించేందుకు క్షేత్ర స్థాయిలో సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా, కేవలం సీఏఆర్ఏ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనధికారిక దత్తత చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరించారు.

పిల్లలకు కుటుంబ ప్రేమానురాగాలను అందించడానికి ఫోస్టర్ కేర్ (తాత్కాలిక పెంపకం) పద్ధతిని ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా పిల్లల విద్యా, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని వెల్లడించారు. ఏదైనా ఇబ్బందుల్లో ఉన్న పిల్లలు కనిపిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ మంద మకరంద్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.05.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



లవ్ ఫెయిల్

వెంటనే కొత్త రిలేషన్‌లోకి వెళ్లొద్దు"రి బౌండ్" రిలేషన్ ఎక్కువగా హర్ట్ చేస్తుంది.





## సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలి

- వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర, బీబీనగర్ :

బీబీనగర్ మండల కేంద్రంలోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో అందిస్తున్న సేవలపై సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. డే కేర్ సెంటర్‌లో ప్రస్తుతం ఎంత మంది వయోవృద్ధులు సేవలు పొందుతున్నారని అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు, ఆహారం, వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాలను పరిశీలించారు. అలాగే సెంటర్‌లో ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఆరా తీశారు. వృద్ధులు విశ్రాంతి తీసుకునే గదులను కలెక్టర్ పరిశీలించి, పరిశుభ్రత, సౌకర్యాల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. వృద్ధులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలన్నారు.. డే కేర్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ మెడికల్ సిబ్బందితో మాట్లాడి, వృద్ధులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్స విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. వృద్ధుల ఆరోగ్యాన్ని కాపాడటంలో వైద్య సిబ్బంది పాత్ర కీలకమని, వారికి అవసరమైన అన్ని రకాల చికిత్సలు సమయానికి అందించాలన్నారు.

## నీట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు

- జిల్లా ఎస్పీ నరసింహ



ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:

మే 3వ తేదిన సూర్యాపేట జిల్లా పరిధిలో నిర్వహించే నీట్ పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 7:00 గంటల వరకు నిషేధ ఆజ్ఞలు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ - 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని జిల్లా ఎస్పీ నరసింహ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు ముసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## ముష్టికుంట్ల వాసికి రూ.2.25 లక్షలు మంజూరు



ముద్ర, ఖమ్మం:

ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి.. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అండగా నిలిచారు. బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన ఖాసీం సాహెబ్ భార్య షేక్.అమీరున్ దీర్ఘకాలిక కీళ్ళ వ్యాధితో బాధపడుతూ.. మెరుగైన వైద్యం కోసం సాయం చేయాల్సిందిగా ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిని గతంలో కలిసి విన్నవించుకుంది. వెంటనే స్పందించిన ఎంపీ సిఫారసు చేయగా.. నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్ )లో మెరుగైన చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓపీ) ద్వారా రూ.2,25,000 మంజూరయ్యాయి. ఈ మంజూరు పత్రాన్ని గురువారం ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ధరావత్ రామ్మూర్తి నాయక్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, మచ్చా రామారావు, సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ బోనకల్ మండల నాయకులు బోయినపల్లి మురళి తదితరులు అందజేశారు.

## వేసవి క్రీడా శిక్షణ కేంద్రాలు ప్రారంభం

ముద్ర, ఖమ్మం:

మల్లెమడుగులోని పీఎన్ శ్రీ జిల్లా ఉన్నత పాఠశాలలో డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభించినట్లు క్యాంప్ ఇన్ చార్జ్ బియ్యని క్రిష్ణయ్య, సీనియర్ జాతీయ క్రీడాకారిణి సిలివేరు పూజిత ప్రకటించారు. ఈ కేంద్రాలను ఆ పాఠశాల హెచ్ ఎం కే. సాంబమూర్తి ప్రారంభించారని ఈ కేంద్రాలలో పుట్ బాట్, కబడ్డీలో శిక్షణ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో ఈ శిక్షణ కేంద్రాల ద్వారా క్రాడా నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చని అన్నారు. ఈ శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని తెలిపారు.




## మే 11 నుంచి విద్యావారం నిర్వహించాలి

విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా





ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 11 నుండి 17 వరకు విద్యా వారంలో భాగంగా పాఠశాలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. దీనిలో భాగంగా మొదటి రోజు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాల ప్రారంభం, పాఠశాలల్లో చేపట్టబోవు సివిల్ పనుల ప్రారంభం, రెండవ రోజు పదో తరగతిలో అనుత్తీర్ణత పొందిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ ప్రారంభం, మూడో రోజు సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లతో జిల్లా స్థాయి కార్యశాల నిర్వహించి విద్యాశాఖలో చేపడుతున్న కార్యక్రమాల పై అవగాహన కల్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, నాల్గో రోజు బడిబాట కార్యక్రమం, పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించడం, ఐదో రోజు గ్రంథాలయ దినోత్సవంగా, ఆరో రోజు కళలు, సాంస్కృతిక పోటీల నిర్వహణ, ఏడో రోజు జవహర్ బాల భవన్ రోజుగా నిర్వహించాలని సూచించారు. సమగ్ర శిక్షా పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అకడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్ లను తప్పనిసరిగా చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టరు భాస్కర రావు, జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

## స్వర్ణగిరిలో వైభవంగా శ్రీ నరసింహ జయంతి వేడుకలు

శ్రీ వేంకటేశ్వర స్వామివారికి తిరుప్పావడ సేవ





ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :

స్వర్ణగిరిలో శ్రీ నరసింహ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో గురువారం వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించి విశేష అలంకారం చేశారు. అనంతరం సుదర్శన నరసింహ హోమం నిర్వహించి దేశ శాంతి సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను భక్తిశ్రద్ధలతో విశేషంగా నిర్వహించారు. సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం. ఆలయంలో తిరుప్పావడ సేవ చేశారు. సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని,లడ్డు,వడ,తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు.వేదమంత్రోచ్చారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు. అనంతరం అర్చకులు శ్రీవారి అష్టలక్ష్మీ మండపంలో వేదమంత్రాలు, మంగళధ్వనుల మధ్య నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

## గిరిజనుల పాలిట వరంగా ప్రభుత్వాసుపత్రి

ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిసర ప్రాంతాలకు వైద్య సేవల్లో కీలకమైన చర్ల ప్రభుత్వ ఆసుపత్రి గత ఆరు నెలల్లో 100 ట్యూ బెక్టమీ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి మరో మైలురాయిని సాధించింది. గతంలో చర్ల ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో ట్యూబెక్టమీ వంటి శస్త్రచికిత్సల కోసం రోగులు 56 కి.మీ దూరంలోని ఏరియా ఆసుపత్రి భద్రాచలం వరకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో రోగులపై ఆర్థిక భారం, శారీరక ఇబ్బందులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం సిజేరియన్ వంటి ప్రధాన శస్త్రచికిత్సలతో పాటు అత్యాధునిక టిఫా స్కానింగ్ సేవలు కూడా అందుబాటులోకి రావడం గమనార్హం. భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు సూచన మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీ జితేశ్ పాటిల్ ప్రత్యేక దృష్టి సారించి ఆరు నెలల క్రితం చర్ల ఆసుపత్రిలో నూతన ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేసి అవసరమైన పరికరాలు సమకూర్చారు. అలాగే మాతృ సేవలకు అవసరమైన ప్రసూతి, పిల్లల, మత్తు వైద్య నిపుణులను నియమించారు. దీంతో స్థానికంగా అన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చి గిరిజన ప్రాంతాల ప్రజలకు పెద్ద ఊరట లభించింది. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ శ్రీ అంకిత్ చర్ల ఆసుపత్రిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇటీవలే ఒక రేడియాలజిస్ట్ వైద్య నిపుణురాలిని నియమించారు.



# సీఎస్ ఆర్ నిధులతో అభివృద్ధి

- కార్యక్రమాలను వేగవంతం చేయాలి
- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :

జిల్లాలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్ ) నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను కోరారు. గురువారం మినీ మీటింగ్ హాల్ లో సిఎస్ ఆర్ సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులకు అవసరమైన వనరులను విస్తృతంగా వినియోగించుకునే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు రావాలని సూచిం చారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన ప్రాధాన్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరాలు అందించారు. విద్య, వైద్యం, ముఖ్య రంగాల్లో సిఎస్ ఆర్ నిధులను వినియోగించే అవకాశాలను చర్చించారు. ప్రభుత్వ పథకాలతో పాటు సిఎస్ ఆర్ నిధులను అనుసంధానం చేస్తే మరింత ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రతి శాఖ తమకు అవసరమైన వాటిని గుర్తించి, స్పష్టమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. స్థానిక పరిశ్రమలు, సంస్థలతో సమన్వయం చేసుకుని సి ఎస్ ఆర్ నిధులను సమీకరించి ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని తెలిపారు. నిధుల వినియోగంలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణ తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. నిధులను సమర్థవంతంగా వినియోగించేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి రవీందర్, పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:



ధాన్యం కొనుగోళ్లను ను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి పట్టణంలోని హుస్సేన బాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏ గ్రేడ్ ధాన్యాన్ని, మిల్లర్స్ బి గ్రేడ్ గా ట్రేడ్ చేస్తున్న పద్ధతి మానుకోవాలన్నారు. అధికారులు , రైస్ మిల్లర్స్, దళారులు రైతులపై నిలువు దోపిడీ అరికట్టాలన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో వరి కోతలు మొదలు కాగా 25 రోజులుగా హుసేనా బాద్ లోని పిఎసిఎస్ కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబెట్టుకుని నిలువ చేసుకున్న రైతులు కొనుగోలు ప్రారంభం కాక రోజుల తరబడి ఎదురుచూస్తున్నారని వెంటనే కొనుగోళ్ళు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బస్వాపురం ఐకెపి కేంద్రం వద్ద గత 25 రోజుల నుండి రైతులు కల్లాల నుంచి ధాన్యం తెచ్చి నిరీక్షిస్తున్నారని కొనుగోలు ప్రారంభించాలి లారీల్లో లోడింద్ చేసి

రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

లోడ్ అయిన లారీలను మిల్లు యజమానులు 24 గంటల్లోపు అన్లోడింగ్ చేసే విధంగా జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు గన్ని బ్యాగుల కొరత తార్పాలిన్ కవర్లు లేక రైతులు వడగళ్ల వానకు తడిసి ధాన్యం నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్ లైన్ యాప్ రద్దుచేసి పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలని కోరారు. సీజన్ దాటిపోక ముందే మే 15 నాటికి దాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి పూర్తి చేయాలని అన్నారు. 48 గంటలలోపు ధాన్యం కొనుగోలు డబ్బులని రైతుల ఖాతాలో జమ చేయాలని , తరుగు పేరుతో 2 కేజీలు, 3 కేజీలు అదనంగా తూకం వేసుకొని రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని వెంటనే ఈ దోపిడీని నివారించాలని కోరారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకా రెడ్డి కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బందెల ఎల్లయ్య, భువనగిరి పట్టణ అధ్యక్షులు బర్ల వెంకటేశం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయకృష్ణ, భువనగిరి మండలం రైతు సంఘం నాయకులు నరాల చంద్రయ్య, వల్దాస్ అంజయ్య, తుమ్మేటి రవి, రాసాల నిర్మల, తుమ్మేటి విజయ, దండే పోయిన పెంటయ్య, పాముల యాదగిరి, కుచ్చుల శేఖర్, కుచ్చుల లక్ష్మి, గాజ వెంకటేశం, కుచ్చుల నవీన్, దండే బోయిన వెంకటేశం పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.05.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**లవ్ ఫెయిల్ : ఆరోగ్యంపై దృష్టి పెట్టండి**

సరైన ఆహారం, నిద్ర, వ్యాయామం - ఇవి మూడ్‌ను బాగా మెరుగు పరుస్తాయి.



# వరి ధాన్యం దిగుమతిలో జాప్యం వద్దు

- **కలెక్టర్ హైమావతి**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

వరిధాన్యం దిగుమతి లో జాప్యం చేయకూడదని, మిల్లులో ఉన్న స్థలం అనుగుణంగా తగినంత ధాన్యం దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు.గురువారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని బాయిల్డ్ రైస్ మిల్లు ప్రతినిధులతో, సివిల్ సప్లై అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఇప్పటివరకు జిల్లాలో 12,936 మెట్రిక్ టన్నులు వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు సివిల్ సప్లై అధికారి తనూజ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో 419 కేంద్రాల్లో వరిధాన్యం కొనుగోలు సజావుగా కొనసాగుతుందని తెలిపారు. తేమ శాతం రాగానే ధాన్యాన్ని తప్పనిసరిగా తాలు తిస్తేనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని రైతులకు తెలిపారు.మిల్లుల్లో ధాన్యంతో వచ్చిన లారీలను దిగుమతిలో జాప్యం కాకుండా ఎక్కువ మంది హమాలీలను ఉంచుకుని వేగంగా దిగుమతి చేసుకోవాలని మిల్లుల యజమానులను ఆదేశించారు. అలాగే వచ్చిన ధాన్యం మేలిరకమైనది కాకపోతే ఆ యొక్క ధాన్యాన్ని వేరొక చోట దిగుమతి చేసుకుని అధికారులకు తెలిపితే ధాన్యాన్ని వెరిఫై చేస్తారని తెలిపారు. తాలు తీసిన ధాన్యాన్ని మాత్రమే మిల్లులకు వచ్చేలా అధికారులు పనిచేస్తున్నారని మీకు ఎలాంటి సమస్యలున్నా ప్రాధాన్యత ప్రకారం పరిష్కరిస్తానని సహకరించాలని తెలిపారు. ధాన్యం గ్రేడ్ నిర్వహణ వ్యవసాయ శాఖ అధికారులు కేటాయిస్తారని తెలిపారు. అధికారులు, మిల్లర్లు అందరి సమన్వయ సహకారంతో రైతులకు వరి ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా పని చెయ్యాలని తెలిపారు.అన్ని కొనుగోలు కేంద్రాలలో లారీలను అందుబాటులో ఉంచాలని ఎక్కడ కూడా కొరత రాకుండా సరిపడినన్ని లారీలను పెట్టాలను ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ లను ఆదేశించారు.



# రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది

- **ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్ అనవసర రాద్ధంతం చేస్తున్నది**
- **రైతుల కోసం కోర్టుకు వెళ్లడం మొసలి కన్నీళ్లు కార్చడమే**
- **సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



రైతులు పండించిన పంటలను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఎవరు కూడా ఆందోళన పడవద్దని సిద్ధిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేట లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను చేయట్లేదని బీఆర్ఎస్ అనవసర రాద్ధంతం చేస్తున్నదన్నారు. సీఎం ఆదేశాల ప్రకారం ప్రతి చోట ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ రైతులను తప్పుదోవ పట్టించి కావాలని రోడ్డెక్కుతున్నారని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉండి రైతులను కేసీఆర్ విస్మరించారని, బీఆరెస్ ప్రభుత్వంలో రైతులు నిరసన తెలిపితే సంకెళ్లు వేసిన చరిత్ర బీఆర్ఎస్ కే చెల్లిందన్నారు. నిరసన తెలిపిన రైతులను పట్టపగలు వారు ఏదోనేరం చేసినట్లు సంకెళ్లు వేసి తీసుకెళ్లిన విషయాన్ని రైతులు ఎవరు కూడా మరిచిపోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ రైతులను అడ్డం పెట్టుకొని నీచ రాజకీయాలు చేస్తున్నదన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షలు రూపాయలు రుణమాఫీ చేసి చూపించడం జరిగిందన్నారు. రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే హరీష్ రావు కోర్టుకు వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు . బీఆర్ఎస్ మొసలి కన్నీరును రైతులు గమనిస్తున్నారని, బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి రైతులు ప్రజలు మోసపోవద్దన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ అధికారంలో ఉండేలా ప్రజలు అందరు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గ్యాదరి మధు, గయాజుద్దీన్, అర్షద్ హుస్సేన్, విజయ, డానియల్, నజ్జు, బాబా తదితరులు పాల్గొన్నారు.

## నిప్పంటుకుని ధాన్యం దగ్ధం

**ముద్ర న్యూస్ :**

బీర్కూర్ శివారులోని గైపీర్ల ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉంచిన వరి ధాన్యం నిప్పంటుకుని దగ్ధమయింది. స్థానికులు, బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బీర్కూర్‌కు చెందిన భూత్పూల్లి నాగరాజు అనే రైతు పంట కోత కోసి 15 రోజుల కిందట ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు గురువారం వరి కయ్యాలకు నిప్పు పెట్టారు. ఆ మంటలు వ్యాప్తి చెంది రోడ్డుపై ఆరబోసిన నాగరాజుకు చెందిన సుమారు రెండు క్వింటాళ్ల ధాన్యం నిప్పు అంటుకుని కాలిపోయింది.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**ముద్ర న్యూస్ :**

రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లింగంపేట మండలం మోతే గ్రామ సర్పంచ్ వజీర్ సుజాత కోరారు. గురువారం లింగంపేట మండలం మోతే గ్రామంలో జిల్లా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో రైతులు అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేశారని తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయించుకుని నష్టపోకూడదనే ఉద్దేశంతో, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా గ్రామంలోనే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పందిరి రవి, మాజీ సొసైటీ చైర్మన్ సుప్పాల రమేష్, మాజీ డైరెక్టర్లు ఎలాల సాయిరెడ్డి, దాసరి సాయిరెడ్డి, వార్డు సభ్యులు కొమురయ్య, సుదర్శన్ గౌడ్, గ్రామ పెద్దలు శివారెడ్డి, సుధాకర్ గౌడ్, నాయకులు మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# స్ప్లాష్ క్రీడా సమ్మర్ క్యాంప్ ముగింపు



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల మెదక్ లో ఏప్రిల్ 18 నుండి 30 వరకు నిర్వహించిన స్ప్లాష్ క్రీడా సమ్మర్ క్యాంప్ ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, మైనారిటీ విద్యా సంస్థల ఏ.ఎఫ్.ఓ నయీముద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ... స్ప్లాష్ 12 రోజుల క్యాంప్‌లో క్రీడలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రేరణాత్మక ఉపన్యాసాలను వివరించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులకు పైగా సాధించిన మొత్తం 26 మంది విద్యార్థులను సత్కరించారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న 155 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎల్.సీ దివం బహుమతి, విజిలెన్స్ టీం జగదీశ్వర్ రెడ్డి, జనాబ్ గౌస్ పాషా, అకాడెమిక్ కోఆర్డినేటర్ వసీమ్‌ఉద్దీన్, కౌన్సిలర్ షమ్స్ ఉన్నిసా ఆరిఫ్, నస్రీన్ బేగం, అనీస్ ఫాతిమా ఇమ్దాద్ అలీ, గౌస్ ఖురేషీ, జుబేర్, డా. ఒమర్ ఖాన్, మొహమ్మద్ వసీమ్, జియో ఇస్లామిక్ ఆర్గనైజేషన్ అయేషా టీమ్, సమీయుద్దీన్, ముజీబ్, ఉమర్,భరోసా సెంటర్ లీగల్ అడ్వైజర్ స్వేతా చౌదరి, షీ టీమ్ ప్రమీల, విజయ్, మెదక్ ప్లాన్ ఇండియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మీ నృసింహస్వామి జాతర



- **కల్యాణోత్సవం, శకట భ్రమణోత్సవం**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

హవేలి ఘనపూర్ మండలం జక్కన్నపేట శ్రీ లక్ష్మి నృసింహస్వామి జయంతి జాతర ఉత్సావాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం గుట్టపైన ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశానుగత ధర్మకర్త విట్టల్ రావు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపారు. భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. తీర్థ, అన్న ప్రసాద వితరణ గావించారు. సాయంత్రం జక్కన్నపేటతోపాటు వివిధ గ్రామాలకు చెందిన వారు ఎడ్ల బండ్ల ప్రదర్శన ( శకటభ్రమణోత్సవం) చేశారు. ఈ సందర్భంగా భక్తుల ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి గోవిందా అంటూ చేసిన నామస్మరణ మారు మ్రోగింది. స్థానిక సర్పంచ్ చామంతుల సత్యనారాయణ, స్నేహ, శివాజీ, సాయిరాం యువజన సంఘాల సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






# సఖి సెంటర్లో బాధితులకు అత్యుత్తమ సేవలు

- **మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నోడల్ అధికారి వల్లేటి ప్రేమ్ చంద్**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

సఖి సెంటర్లో బాధితులకు అత్యుత్తమ సేవలు అందాలని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నోడల్ అధికారి వల్లేటి ప్రేమ్ చంద్ అన్నారు. నర్సాపూర్ పరిధిలో రెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న సఖి కేంద్రం, అంగన్వాడి సెంటర్ ను తనిఖీ చేశారు. సఖి సెంటర్లో రిజిస్టర్లని తనిఖీ చేస్తూ క్లిష్టమైన కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే మహిళలు పని చేసే చోట కలిగే ఇబ్బందులు, మహిళలపై లైంగిక దాడి చట్టంపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అనంతరం అంగన్వాడి సెంటర్ ను పరిశీలించి గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న ఆహార పదార్థాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో తల్లీబిడ్డలకు సంపూర్ణ పోషకాహారం అందించాలని తెలిపారు. వెంట జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, సిడిపిఓ స్వరూప, అంగన్వాడీ టీచర్స్ తదితరులన్నారు.

# ఈవ్ టీజింగ్‌పై షీ టీమ్స్ ఉక్కుపాదం

- **ఏప్రిల్ నెలలో 8 ఎఫ్ఐఆర్‌లు, 8 ఈ పెట్టి కేసులు : ఎస్పీ**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



జిల్లాలో మహిళలు, బాలికల భద్రత కోసం షీ-టీమ్స్ కట్టుదిట్టంగా పనిచేస్తున్నాయని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఏప్రిల్ నెలలో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన వారిపై 8 ఎఫ్ఐఆర్‌లు, 8 ఈ-పెట్టి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూప్రాన్ సబ్‌డివిజన్‌లో 16 మంది, మెదక్ సబ్‌డివిజన్‌లో 40 మంది, మొత్తం 56 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మహిళలను గౌరవించాలని, చట్టవిరుద్ధ చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, బస్‌స్టాప్‌లు, రద్దీ ప్రాంతాల్లో షీ-టీమ్స్ ఆధ్వర్యంలో 40 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, బాల్యవివాహాల నిరోధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా మహిళలను వేధించినా, అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్ 100 లేదా షీటీమ్ వాట్సాప్ నంబర్ 8712657963కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండకముందే బాలికల వివాహాలు జరిగితే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పనిచేస్తోందని, మానవ అక్రమ రవాణా, ఆర్గనైజ్డ్ నేరాలపై సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# శిశువు వద్దనుకుంటే తొట్టెలలో వేయండి

- **ఎంసిహెచ్ వద్ద ప్రారంభించిన వైస్ చైర్మన్ నరేష్ గౌడ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

చిన్న పిల్లలు (శిశువు) వద్దు అనుకుంటే ముళ్లపొదలు, చెత్త బుట్టలో వేయకుండా ఊయల (తొట్టెల)లో వేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్ సూచించారు. మెదక్ ఎంసిహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఊయలను మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్ ప్రారంభించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కలెక్టర్ ఆదేశానుసారం మహిళ, శిశు, దివ్యాంగులు, వయవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, హెల్త్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఎవరైనా వేసినచో ఆ పిల్లలను మహిళా, శిశు సంక్షేమ శాఖ రక్షించి సంరక్షణ బాధ్యత తీసుకొని వారిని అన్ని రకాలుగా ప్రయోజకులను చేయడం జరుగుతుందన్నారు. పిల్లలు వద్దనుకున్నవారు తీసుకువచ్చి చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించవచ్చని, 1098 కు సమాచారం ఇవ్వవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ రేవతి, హెచ్ఓడి గైనకాలజిస్ట్ రాజేశ్వరి, మెదక్ సిడిపిఓ వెంకటరమణ, సూపర్వైజర్లు శ్రీదేవి, మాధవి, అంగన్వాడి టీచర్లున్నారు.

# మెదక్ ఇంచార్జి డీఈఓగా రాజు నియామకం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మెదక్ జిల్లా ఇంచార్జి విద్యాధికారిగా ఎస్. రాజుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ పాఠశాల విద్యా సంచాలక కార్యాలయం, హైదరాబాద్‌లోని సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న రాజుకు కామారెడ్డి జిల్లా బాధ్యతలున్నాయి. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఇంచార్జి డిఈఓ విజయ ఉద్యోగ విరమణ చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 01.05.2026
www.mudranews.in | @mudranews



**లవ్ ఫెయిల్:**

మీ ఫీలింగ్స్‌ను అంగీకరించండి బాధ, కోపం, నిరాశ — ఇవన్నీ సహజం. వాటిని దాచిపెట్టకండి.



# నిరంతర విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యం

**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ప్రజాభవన్లో విద్యుత్ సరఫరాపై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రత పెరగడం, ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని, దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు, అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఆయన క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్‌కో సీఎండీ హరీష్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## టెట్ పరీక్షపై టీ-శాట్ స్పెషల్ లైవ్




**ముద్ర, శేరిలింగంపల్లి :** తెలంగాణ ప్రభుత్వం జూన్ నెలలో నిర్వహించబోయే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పై అవగాహన కల్పించేందుకు టి-సాట్ నెట్వర్క్ ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. మే నెల 1 శుక్రవారం ఉదయం 11 గంటలకు మ్యాథమెటిక్స్, ఎన్విరాన్ మెంటల్ స్టడీస్, చైల్డ్ డెవలప్ మెంట్ అండ్ పెడగాజి, సోషల్ స్టడీస్ వంటి నాలుగు సబ్జెక్టులపై అనుభవం కలిగిన ఉపన్యాసకులచే స్పెషల్ లైవ్ ఏర్పాటు చేశామమని, టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు లైవ్ కార్యక్రమం ద్వార తమ తమ సందేహాలు తీర్చుకుని సమాధానాలు పొందవచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే నాలుగు విడతలుగా టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ నిర్వహించిందన్నారు.

ఐదవ సారి జూన్ నెలలో నిర్వహించబోతోందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అన్ లైన్ దరఖాస్తు పూర్తి చేసుకుని ఉన్నందున లైవ్ కార్యక్రమం పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపయోగప డుతుందని తెలిపారు.

**ప్రత్యేక డిజిటల్ ప్రసారాలు..**

జూన్ 15 నుంచి 30 వరకు జరిగే టెట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు 90 గంటల డిజిటల్ కంటెంట్ ను మే నెల ఒకటవ తేది నుండి జూన్ 14వ తేది వరకు సుమారు 45 రోజులు 180 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నామని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. అరగంట నిడివిగల పాఠ్యాంశాలు విద్య ఛానల్ లో ఉదయం ఎనిమిది నుండి పది గంటల వరకు, అవే పాఠ్యాంశాలు నిపుణ ఛానల్ లో సాయంత్రం ఏడు గంటల నుండి తొమ్మిది గంటల వరకు పున ప్రసారమౌతాయని వివరించారు. ప్రతి రోజూ నాలుగు సబ్జెక్టులకు సంబంధించిన డిజిటల్ కంటెంట్ టి-సాట్ శాటి లైట్ ఛానళ్లతో పాటు యూట్యూబ్, యాప్ లోనూ దుబాటులో ఉంటాయని తెలిపారు.

# కాళేశ్వరం బ్యారేజీలను మరమ్మతు చేస్తాం

**- దశల వారీగా సాంకేతిక పరీక్షలు**

**- ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్**




**మహదేవపూర్, ముద్ర:** కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగమైన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ, అన్నారం సరస్వతి బ్యారేజీలను త్వరగా మరమ్మతు చేస్తామని ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్ స్పష్టం చేశారు. గురువారం మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ, అన్నారం సరస్వతి బ్యారేజీలను కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పరిశీలించారు. మేడిగడ్డ లో కొనసాగుతున్న బోర్ హోల్స్ పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్ట్ ల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలన్నారు. సిబ్బంది కోసం గతంలో సీఆర్పీఎఫ్ పోలీ సులు ఉపయోగించిన షెడ్లను కేటాయించాలని తెలిపారు. వాటిల్లో విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం అన్నారంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద అదనపు సిబ్బంది వసతి కోసం గదులను పరిశీలించారు. అన్నారం ప్రాజెక్ట్ అప్ స్ట్రీమ్ ను పరిశీలించారు. బోర్ హోల్స్ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రాజెక్టులో సాంకేతిక పరిశీలన పనులను శుక్రవారం నుంచి ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక పరీక్షలను దశల వారీగా చేపట్టాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా పరిశీలన పనుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. డ్రిల్లింగ్ పనులు చేపట్టేటప్పుడు గట్టి శిలా పొర వచ్చేంతవరకు కొనసాగించాలని సూచించారు. ప్రాజెక్టులో వివిధ దశల్లో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తూ పనుల నాణ్యతను నిర్ధారించాలని తెలిపారు. విద్యుత్ సరఫరాను అందు బాటులో ఉంచాలన్నారు. ఇరిగేషన్ అధికా రులు ప్రతిరోజు పర్య వేక్షించాలన్నారు. ఈఎన్సీ రమేష్ కుమార్, సీఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈలు తిరుపతిరావు, యాదగిరి పాల్గొన్నారు.

# పోలీసు అధికారుల సేవలు వెలకట్టలేనివి

**- సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్**




**ముద్ర, శేరిలింగంపల్లి:** పోలీసు అధికారుల సేవలు వెలకట్టలేనివని సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఎం. రమేశ్ అన్నారు. కమిషనరేట్ ఆడిటోరియంలో గురువారం పదవీ విరమణ పొందిన ఏడుగురు పోలీసు సిబ్బందిని సన్మానించి పెన్షన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనిఫాం పోలీస్‌కు రెండో చర్మంలాంటిదని, ప్రజల కన్నీరు తుడిచి, వారికి సేవలు అందించిన ప్రతి పోలీసు అధికారి పదవీ విరమణ సమయంలో గర్వపడాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి తన కుటుంబానికి రుణపడి ఉండాలన్నారు. పోలీసులు విధుల నిర్వహించే క్రమంలో వారి కుటుంబ సభ్యులు ఎన్నో త్యాగాలు చేస్తారని గుర్తు చేశారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, సమాజంలోని పౌరులతో సానుభూతితో, గౌరవంతో మెలగాలని సూచించారు. పదవీ విరమణ చేసిన పోలీసులు తమ అనుభవంతో పోలీస్ శాఖకు అవసరమైనప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ బీ ఏడీసీపీ రవికుమార్ డీసీపీగా ప్రమోషన్ పొందినందుకు సీపీ అభినందనలు తెలిపారు. తన పదవీ విరమణ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు చేరువయ్యేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఒక కానిస్టేబుల్ కుమారుడిగా కెరీర్‌ను ప్రారంభించి నేడు డీసీపీ స్థాయికి ఎదగడం పట్ల గర్వంగా ఉందన్నారు. పోలీస్ శాఖలో శారీరక శ్రమతో పాటు 'హ్యూమన్ ఇంటెలిజెన్స్', మేధోపరమైన కృషి ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. తన విజయ ప్రస్థానంలో కుటుంబ సభ్యుల తోడ్పాటు మరవలేనిదని ఆయన గుర్తు చేసుకున్నారు. ట్రాఫిక్ 2 డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఎస్‌బీ ఎస్ఐ పి. వెంకట్ రెడ్డి, ఏఆర్ఎస్ఐ కె. మురళీధర్, సంగారెడ్డి జిల్లా అటాచ్‌మెంట్‌తో సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఆర్ఎస్ఐ ఎన్. కృష్ణ సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఎస్ఐ వి. వెంకట సూర్య నారాయణ రాజు ఈఓడబ్ల్యూ సైబరాబాద్‌లో డి. రాములు, మోకిల పోలీస్ స్టేషన్‌లో జి. అశోక్, బార్బర్, సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో పదవీ విరమణ పొందారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ఎస్‌బి ఏడీసీపీ రవికుమార్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా ప్రారంభమైన పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు



**ముద్ర, తిరుపతి:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వసంత ఋతువులో మేషరాశిలో సూర్యుడు ఎక్కువ ప్రకాశవంతంగా ఉంటాడు. సూర్యకిరణాల వేడి వల్ల జీవులకు వ్యాధి బాధలు కలుగుతాయి. శ్రీ పద్మావతి అమ్మవారిని వసంతోత్సవాల ద్వారా ఆరాధించడం వల్ల భక్తులకు శారీరక, మానసిక శాంతి లభిస్తుందని విశ్వాసం.

**వైభవంగా స్నపనతిరుమంజనం**

గురువారం ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఉత్సవర్లను ఆలయం నుంచి శుక్రవారపు తోటకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. 2.30 గంటల నుంచి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించనున్నారు.

**శేషాచలాన్ని తలపించిన శుక్రవారపుతోట**

టీటీడీ ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారపు తోటలో శేషాచలం అడవిని తలపించేలా తీర్చిదిద్దారు. పచ్చని చెట్లు, పుష్పాలు, జంతువుల ఆకృతులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఆవు, దూడ, కోతి, నెమలి, హంసలు, చిలుకలు వంటి రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇందులో 300 కేజీల వట్టి వేరు, 500 కేజీల సాంప్రదాయ పుష్పాలు, 15 వేల కట్ ఫ్లవర్స్‌తో వివిధ రకాల ఫలాలు వినియోగించారు. ఇందులో బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన అలంకరణ నిపుణులు, టిటిడి సిబ్బంది ఇందుకోసం పనిచేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్లు ముని చెంగల్రాయులు, రమేష్, సురేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం



**ముద్ర, తిరుపతి:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. డిప్యూటీ సీఎం రాకను గమనించిన భక్తులు ఆయనను కలిసేందుకు ఉత్సాహం చూపారు.

**శ్రీకాళహస్తీశ్వరుడిని సన్నిధిలో భట్టి..**

అనంతరం శ్రీకాళహస్తికి చేరుకుని, శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో కొలువుదీరిన పరమశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## క్రమశిక్షణ, నిజాయితీ ఉద్యోగికి గుర్తింపు ఇస్తాయి



**ముద్ర, హైదరాబాద్ :** క్రమశిక్షణ, నిజాయితీ ఉద్యోగికి గుర్తింపునిస్తాయని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు అన్నారు. గురువారం ఎస్కీ ఉద్యోగి ఎల్లయ్య పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యోగానికి, పదవీ విరమణకు మధ్య ఉన్న సమయం అత్యంత విలువైనదని, ఉద్యోగ విధులతో పాటుగా సంసారం జీవితం, పిల్లల చదువులు, వారి బాగోగులు, పెళ్లిళ్లు, పేరంటాలు, బంధుత్వాలు అన్నింటితో పాటుగా విలువలతో కూడిన జీవితం, మంచితనం మాత్రమే తీయని జ్ఞాపకాలుగా మిగిలివుంటాయన్నారు.

1991 ఎస్కీ లో విధుల్లో చేరిన ఎల్లయ్య క్రమంగా అసిస్టెంట్ మేనేజర్ స్థాయికి ఎదిగి 35 ఏళ్ల తన సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో అందరిచేత మంచివాడిగా అనిపించుకుని పదవీ విరమణ పొందుతున్న అదృష్టవంతుడన్నారు. ఎస్కీ రవాణా విభాగం, హార్టీ కల్చర్, హాస్టల్ నిర్వహణ తదితర వాటిల్లో పనిచేసి అందరితో మంచిపేరు తెచ్చుకున్నారని అన్నారు. ఎల్లయ్య సన్నిహితులు, సహచర సిబ్బంది సుధాకర్, నాగ మల్లేశ్వర రావు, నాగేశ్వర్ రావు, కాలేజ్ చీఫ్ లక్ష్మి కాంత రావు, డాక్టర్ పి. రాజారావు పాల్గొన్నారు

లవ్ ఫెయిల్
మద్యం/ అడిక్షన్లకు దూరంగా ఉండండి
ఇవి తాత్కాలిక రిలీఫ్ ఇస్తాయి కానీ సమస్యను పెంచుతాయి.

## రైతు రుణమాఫీ కోసం..

# హైకోర్టుకు హరీష్ రావు

● అర్హులకు రుణమాఫీ కావట్లేదని పిటిషన్



**ముద్ర, హైదరాబాద్:** అర్హులైన రైతులకు రుణమాఫీ కావట్లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ వేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో 23 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదని, ప్రభుత్వ జీవో పూర్తిస్థాయిలో అమలుకావట్లేదని హరీశ్‌రావు న్యాయవాది వాదించారు. రుణమాఫీ కాకపోవడం వల్ల రైతులు ఆవేదనకు గురవుతున్నారని, నియోజకవర్గ రైతుల తరపున హరీశ్‌రావు పిటిషన్ వేశారని న్యాయవాది కోర్టుకు విన్నవించారు. దీనిపై ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసుకోవాలని జీపీ వాదించారు. విచారించిన హైకోర్టు ప్రజల సమస్య అయితే పిల్ దాఖలు చేయాలని సూచించింది. హైకోర్టు సూచనతో హరీశ్‌రావు పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

## 'ఉస్మానియా'లో లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్




**ముద్ర డెస్క్:** ఉస్మానియా ఆస్పత్రిలో ఓ బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. గ్లైకోజెన్ స్టోరేజ్ డిసీజ్‌తో బాధపడుతున్న 18 నెలల చిన్నారికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. 10 కిలోల బరువున్న బాలుడికి లివర్ మార్పిడి చేసిన వైద్యులు, తండ్రి లివర్ నుంచి కొంత భాగాన్ని సేకరించి చిన్నారికి అమర్చారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా చికిత్స అందించారు. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఉస్మానియా వైద్య బృందాన్ని మంత్రి రాజనరసింహ అభినందించారు.

# తమిళనాట విజయ్‌కి పట్టం..?

● విద్యార్థులు, మహిళల మద్దతు
● యాక్సిస్ మై ఇండియా సర్వే వెల్లడి



**ముద్ర డెస్క్:** తమిళనాడు రాజకీయ యవనికపై కొత్త చరిత్ర లిఖించబడనుందా..? దశాబ్దాలుగా సాగుతున్న ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి తెరపడనుందా..? అంటే 'అవును' అనే సమాధానం ఇస్తున్నాయి తాజా ఎగ్జిట్ పోల్స్. ముఖ్యంగా ప్రముఖ సర్వే సంస్థ యాక్సిస్ మై ఇండియా వెల్లడించిన అంచనాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. దళపతి విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఈ సారి ఎన్నికల్లో 'కింగ్ మేకర్' మాత్రమే కాదు, ఏకంగా 'కింగ్' అయ్యే దిశగా దూసుకుపోతోందని ఈ సర్వే స్పష్టం చేసింది.

### విజయ్ వైపు యువత, మహిళలు

తమిళనాడు రాజకీయాల్లో సినీ నటులు రాణించడం కొత్తేమీ కాదు. కానీ విజయ్ కేవలం ఒక స్టార్‌గా కాకుండా ఒక వ్యవస్థీకృత శక్తిగా ఎదిగారు. యాక్సిస్ మై ఇండియా అంచనాల ప్రకారం.. టీవీకే పార్టీకి ఏకంగా 35 శాతం ఓట్లు లభించే అవకాశం ఉంది. ఇందులో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే సుమారు 38 శాతం మంది మహిళలు విజయ్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు.

యువతలో విజయ్ ప్రభావం అసాధారణంగా ఉంది. 67 శాతం కంటే ఎక్కువ మంది యువ ఓటర్లు టీవీకేకు మద్దతు తెలపడం గమనార్హం. కేవలం సినిమా అభిమానులే కాకుండా.. గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగులు మరియు ప్రైవేట్ ఉద్యోగులు కూడా మార్పు కోరుకుంటూ విజయ్ వైపు మొగ్గు చూపినట్లు సర్వే విశ్లేషించింది.

### ముక్కోణపు పోరులో ముందంజ ఎవరిది?

సాధారణంగా తమిళనాడులో పోటీ డీఎంకే, అన్నాడీఎంకే మధ్యే ఉంటుంది. కానీ ఈసారి టీవీకే రాకతో అది త్రిముఖ పోటీగా మారింది. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ డీఎంకే కూటమి తిరిగి అధికారంలోకి వస్తుందని చెబుతున్నప్పటికీ, గతంలో అత్యంత ఖచ్చితమైన అంచనాలు ఇచ్చిన యాక్సిస్ మై ఇండియా మాత్రం భిన్నమైన లెక్కలను బయటపెట్టింది.

### సర్వే ప్రకారం అంచనాలు..

టీవీకే (విజయ్) 98 – 120
డీఎంకే కూటమి 92 – 110
అన్నాడీఎంకే కూటమి 22 – 30

మొత్తం 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118. యాక్సిస్ అంచనాల ప్రకారం టీవీకేకు గరిష్ఠంగా 120 స్థానాలు వస్తే, విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. ఒకవేళ ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోతే, అప్పుడు విజయ్ మద్దతు రాష్ట్ర భవిష్యత్తును శాసించనుంది.

### నగరాల్లో జైత్రయాత్ర.. గ్రామాల్లో ప్రతిఘటన

పట్టణ ప్రాంతాల్లో టీవీకే ప్రభంజనం స్పష్టంగా కనిపిస్తోందని సర్వే చెబుతోంది. డీఎంకేకు కంచుకోటల్లాంటి నగరాల్లో కూడా విజయ్ ఓట్లు చీల్చగలిగారు. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం డీఎంకే తన పట్టును నిలబెట్టుకుంది. దళిత వర్గాలు కూడా అధికంగా డీఎంకే వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ప్రైవేట్ రంగంలో పని చేసే గృహిణులు సైతం ధరల పెరుగుదల, మార్పు ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని టీవీకేకు పట్టం కట్టినట్లు సమాచారం.

### చరిత్ర పునరావృతమవుతుందా..?

గతంలో ఎం.జి. రామచంద్రన్, పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో నందమూరి తారక రామారావు పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే ప్రభంజనం సృష్టించి ముఖ్యమంత్రులయ్యారు. ఇప్పుడు విజయ్ కూడా అదే బాటలో పయనిస్తున్నట్లు కనిపిస్తోంది.

మే 4న వెలువడనున్న తుది ఫలితాల కోసం యావత్ దేశం ఉత్కంఠతో ఎదురు చూస్తోంది. ఒకవేళ యాక్సిస్ మై ఇండియా అంచనాలు నిజమైతే తమిళనాడు రాజకీయాల్లో ఒక నవశకం ప్రారంభమైనట్లే. ద్రవిడ రాజకీయాల కోటను బద్దలు కొట్టి విజయ్ సింహాసనాన్ని అధిష్ఠిస్తారో లేదో చూడాలి..!

# పాలక వర్గాల రద్దుపై సహకార సంఘాల నిరసన

**ముద్ర డెస్క్:** హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించి, రాష్ట్రంలోని సహకార సంఘాల పాలక వర్గాలను రద్దు చేసి నామినేటెడ్ విధానాన్ని తీసుకురావాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంకు మాజీ చైర్మన్ కొండూరు రవీందర్ రావుతో పాటు సహకార సంఘాల ప్రతినిధులు ఆశోక్, మంజులా రెడ్డి, వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్, రాజేందర్, పాండు యాదవ్ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కొండూరు రవీందర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన 597 జీవో ద్వారా సహకార సంఘాల పాలక వర్గాలను రద్దు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించగా, గత పాలక వర్గాలను తిరిగి కొనసాగించాలని న్యాయస్థానం స్పష్టమైన తీర్పు ఇచ్చిందని తెలిపారు. అయితే నాలుగు నెలలుగా ప్రభుత్వం ఆ తీర్పును అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 330 సహకార సంఘాలు కోర్టును ఆశ్రయించాయని, ఈ సంఘాల్లో రాజకీయ ప్రమేయం చాలా తక్కువగా ఉండి ప్రధానంగా రైతులే సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది సభ్యులతో 60 వేల కోట్ల రూపాయల వ్యాపారం సహకార వ్యవస్థ ద్వారా నడుస్తోందని వివరించారు. ఎక్కడైనా అవకతవకలు జరిగిన చోట మాత్రమే ప్రత్యేక అధికారులను నియమించాలని, మొత్తం వ్యవస్థను రద్దు చేసి నామినేటెడ్ విధానాన్ని తీసుకురావడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించాలనీ, లేకపోతే అప్పటి వరకు గత పాలక వర్గాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని కోరిన ప్రతినిధులు, ప్రస్తుతం రైతులు పంట కొనుగోళ్ల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘ సభ్యులు రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రొఫెషనల్ బ్యాంకర్లకు సహకార వ్యవస్థలో అవకాశం కల్పించారని, అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకార వ్యవస్థ బలోపేతానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని గుర్తు చేశారు. అదే విధంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా సహకార వ్యవస్థకు స్వతంత్రత కల్పించి, పారదర్శక ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

"ప్రజల చేత ఎన్నుకోబడిన పాలక వర్గాలను తొలగించి నామినేటెడ్ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఏముంది?" అని ప్రశ్నించారు.

# వీహెచ్‌కు కీలక పదవి

● బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా నియామకం
● ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ
● రాష్ట్ర మంత్రి సమాన హోదా కల్పన



**ముద్ర, హైదరాబాద్:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు (వీహెచ్)కు తెలంగాణ ప్రభుత్వం కీలక బాధ్యతలను అప్పగించింది. బీసీ వర్గాల హక్కుల కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ పదవికి రాష్ట్ర మంత్రి సమాన హోదా కల్పించగా, వి. హనుమంతరావుకు నెలకు రూ. 1,00,000 వేతనం అందనుంది. ప్రభుత్వ నివాసం కేటాయించని పక్షంలో రూ. 50,000 హౌస్ రెంట్ అలవెన్స్ అందించనున్నారు. అదనంగా ప్రయాణ ఖర్చుల కోసం రూ. 30,000 కన్వేయన్స్ అలవెన్స్, రూ. 15,000 ఇంధన భత్యంతో పాటు డ్రైవర్‌తో కూడిన ప్రభుత్వ వాహనం కూడా సమకూర్చనున్నారు. వైద్య ఖర్చుల విషయంలో అఖిల భారత సర్వీసు అధికారులు, మంత్రులతో సమానంగా రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించారు.

వీహెచ్ కార్యాలయ నిర్వహణ కోసం బీసీ సంక్షేమ శాఖ ప్రైవేట్ సెక్రటరీ, డేటా ఎంట్రీ ఆపరేటర్, కార్యాలయ సిబ్బంది, డ్రైవర్‌తో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. బీసీ హక్కుల పరిరక్షణలో ఆయనకు ఉన్న అనుభవం, ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు దిశానిర్దేశం చేయడంలో కీలకంగా మారనుంది.

సీనియర్ నేతలకు ఇలాంటి బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీలోనూ, సామాజిక సమీకరణాల్లోనూ సమతుల్యతను సాధించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# నిర్లక్ష్యాన్ని సహించం

- ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి శ్రీధర్ బాబు



**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎట్టి పరిస్థితుల్లోను నిర్దేశించిన లక్ష్యాల మేరకు ముందుకు సాగాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి శాసనసభ నియోజక వర్గంలో ఏటా 3,500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. గురువారం హిమాయత్ నగర్ లోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 13 శాసనసభ నియోజకవర్గాల ఇందిరమ్మ ఇళ్ల పనుల సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. రెవిన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, లక్ష్మణ కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి గౌతమ్, కలెక్టర్లు, పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. అటవీ భూములకు సంబంధించిన అంశాలను ఆ శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఫారెస్ట్ క్లియరెన్సుల కారణంగా ఇళ్ల నిర్మాణం కుంటుపడటానికి వీలు లేదని పేర్కొన్నారు. లక్ష్యాలను చేరుకోలేని అధికారులను ఉపేక్షించేది లేదని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు.

# మే చివరి నాటికి 2బీహెచ్ కే ఇళ్లు

- ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ లేదు
- రెవెన్యూ, ఫారెస్టు జాయింట్ సర్వేకు ఆదేశాలు



**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలను మే నెలాఖరు నాటికి పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి కేటాయించాలని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, రెవెన్యూ, హౌసింగ్, ఫారెస్టు శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ, కరీంనగర్ ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ–పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హెచ్. వేణుగోపాల్ తదితరులు హాజరయ్యారు. నిర్మాణం చివరి దశలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు ఇప్పటికే ఖర్చు చేసిన మొత్తాన్ని మినహాయించి, మిగిలిన పనులకు ఐదు లక్షల లోపు వ్యయాన్ని ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందజేస్తామని తెలిపారు. కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో లబ్ధిదారులే ఇండ్లను పూర్తి చేసుకునేలా అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ పనులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. 2బీహెచ్‌కే కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు రూ.400 కోట్లతో చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. అనర్హులను గుర్తించి తొలగించి, అర్హులకు ఇండ్లను కేటాయించాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఇందులో ఎమ్మెల్యేలను భాగస్వాములుగా చేసుకోవాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పొందినప్పటికీ అక్కడ నివసించని వారి ఇండ్లను రద్దు చేసి, అర్హులైన ఇతరులకు కేటాయించే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పేదరికమే ఇండ్ల కేటాయింపుకు ప్రధాన ప్రమాణమని, ఎల్–1, ఎల్–2, ఎల్–3 దరఖా స్తుల కంటే అర్హతే ముఖ్యం అని పేర్కొన్నారు. మొదటి విడతలో ఇండ్లు నిర్మించుకోని వారి స్థానంలో కొత్త లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని సూచించారు. నగరాలకు దూరంగా నిర్మించిన కాలనీ లలో నివాసం ఏర్పరచు కోవడంపై లబ్ధి దారులు ఆసక్తి చూపడం లేదని, అటువంటి ఇండ్లను సమీప ప్రాంతాల అర్హులకు కేటాయించే విధానంపై పరిశీలన కొనసాగుతోందని తెలిపారు.

### ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

రెవెన్యూ, ఫారెస్టు భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రెండు శాఖలు కలిసి జాయింట్ సర్వే నిర్వహించాలని సూచించారు. ఆధు నిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో భూముల స్పష్టమైన సరిహద్దులను గుర్తించాలన్నారు. భూ పరిపాలనను బలోపేతం చేయడానికి సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని, భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు చేసే యోచన లేదని స్పష్టం చేశారు.

అనంతరం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో 30 కేవీ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు.



## రికార్డు కనిష్టానికి రూపాయి

- డాలర్‌తో పోలిస్తే రూ. 94.85కు చేరిక
- 0.32% పతనంతో కొత్త కనిష్టాన్ని తాకిన కరెన్సీ

**ముద్ర, న్యూ ఢిల్లీ:** భారత కరెన్సీ రూపాయి మరోసారి పతనమై రికార్డు కనిష్ఠ స్థాయికి చేరుకుంది. గురువారం ట్రేడింగ్‌లో రూపాయి 0.32 శాతం క్షీణించి అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూ. 94.85 వద్ద నిలిచింది. ఇది ఇప్పటివరకు నమోదైన కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గత ఏప్రిల్ నెలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న చర్యలతో కొంత కాలం రూపాయి బలపడినప్పటికీ, ఆ ప్రభావం ఎక్కువకాలం నిలవలేదు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్ బలపడటం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ వంటి కారణాలతో రూపాయి మళ్లీ ఒత్తిడికి లోనవుతోంది.

మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల వంటి అంశాలు రూపాయి విలువపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో కరెన్సీ మార్పిడి విలువలో మరింత అస్తవ్యస్తత ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## లోయలో పడిన జీపు.. 17 మంది మృతి

**ముద్ర డెస్క్:** నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోల్పా జిల్లాలోని పర్వత ప్రాంతంలో ఓ ప్రైవేటు జీపు అదుపు తప్పి 700 మీటర్ల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న వారిలో 17 మంది మృతి చెందారు. స్థానికులు జల్‌జలాలో జరిగే వైశాఖ పౌర్ణమి వేడుకలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వర్షం కారణంగా బురద ఏర్పడి వాహనం జారి పడిందని పోలీసులు వెల్లడించారు. ప్రతికూల వాతావరణంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందన్నారు. ఘటన సమయంలో వాహనంలో ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదని అధికారులు పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

శుక్రవారం 01.05.2026

www.mudranews.in | @mudranews



లవ్ ఫెయిల్ : మీపై ఫోకస్ పెట్టండికొత్త స్కిల్స్ నేర్చుకోండి, కెరీర్‌పై దృష్టి పెట్టండి.



# రియాన్ పరాగ్‌పై బీసీసీఐ వేటు

**మ్యాచ్ ఫీజులో కోత.. ● ఆట ప్రతిష్టకు భంగం కలిగించినందుకు కఠిన చర్యలు..**

**వరుస ఉల్లంఘనలతో రాజస్థాన్ రాయల్స్ జట్టుపై బీసీసీఐ సీరియస్**





ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ అనూహ్య రీతిలో క్రమశిక్షణా చర్యలకు గురయ్యారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరెట్ (వేప్) వాడుతూ కెమెరాకు చిక్కడం తీవ్ర చర్చనీయాంశమైంది. క్రీడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, క్రికెట్ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు గాను భారత క్రికెట్ నియంత్రణ మండలి పరాగ్‌పై కఠిన చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ ముందు పరాగ్ తన తప్పును అంగీకరించడంతో శిక్షను ఖరారు చేశారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.21 ప్రకారం, ఆట గౌరవానికి భంగం కలిగించే చర్యలకు పాల్పడినందుకు గాను పరాగ్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తున్నట్లు ప్రకటించారు. అదనంగా అతనికి ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా కేటాయించారు. డ్రెస్సింగ్ రూమ్ పరిసరాల్లో వేప్ వంటి నిషేధిత అలవాట్లు ప్రదర్శించడం నిబంధనల ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది. కాగా, రాజస్థాన్ రాయల్స్ జట్టులో వరుసగా ఇలాంటి ఉల్లంఘనలు చోటుచేసుకోవడం గమనార్హం. కొద్దిరోజుల క్రితమే టీమ్ మేనేజర్ రోమీ భిందర్ డగౌట్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఫోన్ వాడటంతో లక్ష రూపాయల జరిమానా ఎదుర్కొన్నారు. తాజాగా కెప్టెన్ పరాగ్ ఉదంతంతో బీసీసీఐ రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యంపై మరియు అధికారులపై మరింత కఠినంగా వ్యవహరించే ఆలోచనలో ఉంది. మైదానంలో ఆటగాళ్లు యువతకు ఆదర్శంగా నిలవాలని, క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదని బోర్డు ఈ సందర్భంగా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.



# శార్దూల్‌పై వింత వ్యూహం

**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ 2026లో ముంబై జట్టు మరో ఓటమిని చవిచూసిన మ్యాచ్ కంటే, ఆ జట్టు తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన పోరులో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన శార్దూల్ ఠాకూర్ బ్యాటింగ్ గానీ, బౌలింగ్ గానీ చేయకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్లుగా వచ్చిన విల్ జాక్స్, రియాన్ రికిల్టన్ మంచి ఆరంభం ఇవ్వగా, ముఖ్యంగా రియాన్ రికిల్టన్ అద్భుత సెంచరీతో చెలరేగి జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. అతని దూకుడు బ్యాటింగ్‌తో ముంబై నిర్ణీత ఓవర్లలో భారీ పరుగులు చేసింది. అయితే లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఓపెనింగ్‌లోనే వేగంగా పరుగులు సాధించి జట్టుకు బలమైన పునాది వేశారు. అనంతరం హెన్రిచ్ క్లాసెన్ వేగవంతమైన అర్ధశతకంతో మ్యాచ్‌ను హైదరాబాద్ వైపు తిప్పేశాడు. దీంతో హైదరాబాద్ జట్టు లక్ష్యాన్ని సులభంగా ఛేదించింది. అయితే మ్యాచ్ తర్వాత ఎక్కువ చర్చకు దారి తీసింది ముంబై జట్టు వ్యూహమే. ఇంపాక్ట్ ప్లేయర్‌గా తీసుకొచ్చిన శార్దూల్ ఠాకూర్‌ను ఎందుకు ఉపయోగించలేదన్న ప్రశ్నలు సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తాయి. ఐపీఎల్ చరిత్రలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చి ఒక్క బంతి కూడా ఆడకపోవడం అరుదైన సంఘటనగా అభిమానులు చర్చిస్తున్నారు. ఈ నిర్ణయం వెనుక అసలు వ్యూహం ఏమిటో స్పష్టత లేకపోవడంతో ముంబై యాజమాన్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం మీద ఈ మ్యాచ్ ఫలితంతో పాటు, శార్దూల్ అంశం కూడా ఈ సీజన్‌లో ప్రధాన చర్చాంశంగా మారింది.

# వాంఖడేకు కాంబ్లీ హాజరు

**ముంబై, ఏప్రిల్ 30 :** భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో, ఆయన అకస్మాత్తుగా వాంఖడే స్టేడియంలో ప్రత్యక్షమవడం అభిమానులకు ఆనందాన్ని కలిగించింది. నడవలేని స్థితిలో ఉన్నప్పటికీ, ఇద్దరి సహాయంతో స్టేడియానికి చేరుకుని ముంబై జట్టుకు మద్దతుగా నిలిచారు. ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చిన కాంబ్లీని చూసి అభిమానులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. ఆయన స్టేడియానికి వచ్చిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అభిమానులు "త్వరగా కోలుకోవాలి" అంటూ ఆకాంక్షలు వ్యక్తం చేయగా, కాంబ్లీ కూడా వారిని చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన ఆరోగ్యం విషమంగా ఉందని ప్రచారం జరిగిన నేపథ్యంలో, ఈ దృశ్యాలు ఆ వదంతులకు చెక్ పెట్టినట్లయ్యాయి. ఇంతకు ముందు ఆయన భార్య ఆండ్రియా హెవిట్ మాట్లాడుతూ, కాంబ్లీ ఆరోగ్యం గురించి వస్తున్న వార్తల్లో నిజం లేదని, దేవుడి కృపతో ఆయన క్షేమంగానే ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కాంబ్లీ స్వయంగా స్టేడియానికి రావడం అభిమానుల్లో నమ్మకాన్ని పెంచింది. తన స్నేహితుడు సచిన్ టెండూల్కర్ తో పాటు ముంబై జట్టుకు మద్దతుగా కాంబ్లీ హాజరయ్యారని అభిమానులు భావిస్తున్నారు. 1991 నుంచి 2000 వరకు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కాంబ్లీ, తన కెరీర్‌లో 17 టెస్టులు, 104 వన్డేలు ఆడారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగవుతోందని తెలిసి అభిమానులు ఊపిరి పీల్చుకుంటున్నారు.





# హిట్‌మ్యాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**ముంబై, ఏప్రిల్ 30 :** భారత క్రికెట్ జట్టు కెప్టెన్, 'హిట్‌మ్యాన్'గా పేరుగాంచిన రోహిత్ శర్మ ఇవాళ 39వ పుట్టిన రోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు, ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. భారత జట్టుకు ఐసీసీ ట్రోఫీలు అందించిన ప్రముఖ కెప్టెన్లలో రోహిత్ శర్మ ఒకరు. టెస్టులు, టీ20 ఫార్మాట్లకు ఇప్పటికే వీడ్కోలు పలికిన రోహిత్ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నారు. ఐపీఎల్‌లో ముంబై జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన, గాయం కారణంగా ఇటీవల కొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉన్నారు. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా రోహిత్ శర్మ ప్రత్యేక గుర్తింపు పొందారు. 2014లో శ్రీలంకపై జరిగిన మ్యాచ్‌లో ఆయన 173 బంతుల్లోనే 264 పరుగులు చేసి చరిత్ర సృష్టించారు. అంతేకాకుండా వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్ కూడా ఆయనే. 2013లో ఆస్ట్రేలియాపై 209 పరుగులు, 2014లో శ్రీలంకపై 264 పరుగులు, 2017లో మరోసారి శ్రీలంకపైనే 208 పరుగులు చేసి అరుదైన రికార్డును నెలకొల్పారు. 2019 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ అద్భుత ప్రదర్శన కనబరిచి 9 ఇన్నింగ్స్‌ల్లో 5 శతకాలు నమోదు చేశారు. మొత్తంగా ప్రపంచకప్‌లలో ఆయన 7 శతకాలు సాధించడం విశేషం. నాయకత్వంలో కూడా రోహిత్ విజయవంతంగా కొనసాగుతూ, 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ టోర్నీల్లో భారత్‌ను విజేతగా నిలిపారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు 650 సిక్సర్లు బాదిన రోహిత్, ఈ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని 359 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నారు. తన అద్భుత ఆటతీరుతో, నాయకత్వంతో భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన రోహిత్ శర్మకు అభిమానులు మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.



# బుమ్రాపై పొలార్డ్ మద్దతు

**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ 2026లో ముంబై జట్టు ప్రధాన బౌలర్ బుమ్రా ప్రదర్శనపై వస్తున్న విమర్శలకు జట్టు బ్యాటింగ్ కోచ్ పొలార్డ్ బలమైన సమాధానం ఇచ్చారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా అధిక పరుగులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఆ మ్యాచ్‌లో బుమ్రా నాలుగు ఓవర్లలో అధిక పరుగులు ఇచ్చినా, దాన్ని పెద్దగా చూడాల్సిన అవసరం లేదని పొలార్డ్ అన్నారు. బుమ్రా ఏదైనా యంత్రం కాదని, అతడూ ఒక మనిషే కాబట్టి అప్పుడప్పుడు ఇలాంటి పరిస్థితులు రావడం సహజమని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొంత ఫామ్ లోపం కనిపిస్తున్నా, త్వరలోనే తిరిగి తన అసలు స్థాయికి చేరుకుంటాడని నమ్మకం వ్యక్తం చేశారు. ఇన్నేళ్లుగా ముంబై జట్టుకు, భారత జట్టుకు బుమ్రా కీలక బౌలర్‌గా నిలిచాడని గుర్తు చేస్తూ, ఒక్క మ్యాచ్ ఆధారంగా అతడిని విమర్శించడం సరైంది కాదని తెలిపారు. జట్టు కోసం ఎన్నో విజయాలు అందించిన ఆటగాడికి మద్దతుగా నిలవాల్సిన సమయం ఇదేనని అన్నారు. మరోవైపు ఈ సీజన్‌లో ముంబై జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, ఇంకా అవకాశాలు పూర్తిగా ముగియలేదని పొలార్డ్ చెప్పారు. ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌లలో తక్కువ విజయాలు సాధించినా, మిగిలిన మ్యాచ్‌ల్లో గెలిచి ప్లే ఆఫ్స్‌కు చేరేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. జట్టు ఇంకా పోటీలోనే ఉందని, చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రెండొందల పరుగులు సులభం ఎందుకు?



**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో మ్యాచ్‌లు భారీ స్కోర్ల వేదికగా మారాయి. దాదాపు ప్రతి మ్యాచ్‌లో రెండొందలకుపైగా పరుగులు నమోదు అవుతుండటంతో బౌలర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు స్పిన్ బౌలింగ్ కోచ్ ముత్తయ్య మురళీధరన్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ముప్పైసార్లకు పైగా రెండొందల స్కోర్లు నమోదవ్వడం, అలాగే భారీ లక్ష్యాలు కూడా సులభంగా ఛేదించబడటం గమనార్హమని ఆయన తెలిపారు. అయితే దీనికి బౌలర్లను తప్పుపట్టడం సరికాదని స్పష్టం చేశారు. ప్రధాన కారణం పిచ్‌లేనని పేర్కొన్నారు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌లు తయారు చేయడం వల్ల టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ వేగంగా పరుగులు సాధిస్తున్నారని అన్నారు. ఇక మైదానాల్లో బౌండరీ పరిమాణం చిన్నగా ఉండటం కూడా బౌలర్లకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. పిచ్‌ను బౌలర్లకు అనుకూలంగా మార్చితే మ్యాచ్‌లు నెమ్మదిగా సాగుతాయని, అది ప్రేక్షకులకు విసుగును కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రేక్షకులు ఎక్కువగా ఫోర్లు, సిక్సులు ఆశిస్తారని, అందుకే ఈ మార్పులు తీసుకొచ్చారని వివరించారు. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనతో అదనంగా ఒక బ్యాట్స్‌మన్ అవకాశం పొందడం వల్ల స్కోర్లు మరింత పెరుగుతున్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఐపీఎల్ కేవలం ఆట మాత్రమే కాకుండా పెద్ద వ్యాపారంగా మారిందని, ఇందులో స్పాన్సర్లు, వీక్షకుల సంఖ్య ఎంతో కీలకమని స్పష్టం చేశారు. మ్యాచ్‌లు ఆసక్తికరంగా లేకపోతే ప్రేక్షకులు చూడరని, అప్పుడు స్పాన్సర్లకు నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. అందుకే వినోదానికి ప్రాధాన్యం ఇస్తూ ఆటలో మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. క్రికెట్ అభివృద్ధి కంటే ప్రేక్షకులకు వినోదం అందించడం కూడా సమానంగా ముఖ్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

# వైభవ్‌పై ముంబై కన్ను

**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ 2026లో సంచలనంగా మారిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ పై ఇప్పుడు అన్ని జట్ల దృష్టి పడుతోంది. ముఖ్యంగా ముంబై ఇండియన్స్ వంటి దిగ్గజ జట్టు ఈ యువ ప్రతిభను తమ జట్టులోకి తీసుకురావాలనే ఆసక్తి చూపుతున్నట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇంగ్లాండ్ మాజీ వేగవంత బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ వైభవ్ ఆటపై ప్రశంసలు కురిపించాడు. ప్రపంచ స్థాయి బౌలర్లను కూడా భయపడకుండా ఎదుర్కొంటూ అతను చూపుతున్న ధైర్యం, ప్రతిభ అసాధారణమని పేర్కొన్నాడు. ఇంత చిన్న వయసులోనే ఇలాంటి స్థాయిలో ఆడటం అరుదైన విషయం అని ఆయన అభిప్రాయపడ్డాడు. గతంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను తక్కువ ధరకు ఎంపిక చేసుకున్నప్పటికీ, ఇప్పుడు అతని ప్రదర్శన చూస్తుంటే భవిష్యత్తులో అతని విలువ భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మళ్లీ వేలంలోకి వస్తే అతని ధర ఎంతో ఎక్కువగా ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఆటగాళ్లను చాలా కాలం పాటు ఒకే జట్టులో ఉంచడం కష్టమైన విషయం. ఈ నేపథ్యంలో రాజస్థాన్ జట్టు వైభవ్‌ను కొనసాగించగలదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు యువ ఆటగాళ్లను గుర్తించి అవకాశాలు ఇచ్చే విషయంలో ముందుండే ముంబై జట్టు, ఈ ప్రతిభను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనతో ఐపీఎల్‌లో అతనిపై భారీ ఆసక్తి నెలకొంది. భవిష్యత్తులో అతను ఏ జట్టుకు ఆడతాడు అన్నది ఆసక్తికరంగా మారింది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 01.05.2026
www.mudranews.in | @mudranews



**లవ్ ఫెయిల్ :**

అవసరమైతే ప్రొఫెషనల్ హెల్ప్ తీసుకోండిబాధ ఎక్కువైతే కౌన్సిలర్ లేదా సైకాలజిస్టును సంప్రదించడం మంచిది.





## మెడికల్ మాఫియా బాగోతంపై దూత-2

ఓటీటీ ప్రపంచంలో డార్క్, రియలిస్టిక్ కథనాలకు పెరుగుతున్న ఆదరణ మధ్య దూత సీజన్ 2పై ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది. మొదటి సీజన్ జర్నలిజం బ్యాక్‌డ్రాప్‌లో సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా ఈ సిరీస్, ఇప్పుడు పూర్తిగా కొత్త జానర్ వైపు మలుపు తిరగడం  హాట్ టాపిక్‌గా మారింది. ఈసారి మేకర్స్ మెడికల్ మాఫియా వంటి సున్నితమైన అంశాన్ని ఎంచుకోవడం విశేషం. ఆరోగ్య రంగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, మాఫియా నెట్వర్క్‌ను రియలిస్టిక్‌గా చూపించే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. దీంతో సిరీస్ మరింత డార్క్, గ్రిప్పింగ్ నేరేషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉంది. ఈ మార్పు వెనుక ప్రధాన బలం దర్శకుడు విక్రమ్ కె. కుమార్ విజన్ అని చెప్పాలి. థ్రిల్లర్ కథనాల్లో తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్న ఆయన, సీజన్ 1లో జర్నలిజం ప్రపంచంలోని అంధకార కోణాలను చూపించినట్లే, ఈసారి మెడికల్ రంగంలోని లోపాలను షాకింగ్ ఎలిమెంట్స్‌తో తెరపైకి తీసుకురానున్నారు. ప్రస్తుతం ఓటిటి ప్లాట్‌ఫార్మ్‌లలో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్‌కు భారీ డిమాండ్ ఉంది. రియలిస్టిక్, డార్క్ కంటెంట్‌కు ప్రేక్షకులు ఎక్కువగా ఆకర్షితులవుతున్న నేపథ్యంలో, 'దూత 2' కూడా అదే ట్రెండ్‌ను క్యాష్ చేసుకునేలా రూపొం దుతోంది. 'దూత' మొదటి సీజన్ మంచి రెస్పాన్స్ అందు కోవడంతో, రెండో సీజన్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి. ఈ సిరీస్‌లో ప్రధాన పాత్రలో నాగ చైతన్య నటించడం మరో ప్లస్ పాయింట్. ఆయన స్టార్ ఇమేజ్, కథలోని తీవ్రత కలిసి ప్రేక్షకులకు మరింత ఇంటెన్స్ అనుభూతిని అందించే అవకాశముంది.



## అగధలో మంజుల మనవరాలు జోవిక

ప్రముఖ సీనియర్ దర్శక నిర్మాత ఎమ్మెస్ రాజు ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న మిస్టికల్ డివైన్ థ్రిల్లర్ 'అగధ'. హారర్ జానర్‌లో రాబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమా ద్వారా తమిళ నటి వనితా విజయ్ కుమార్ కుమార్తె,అలనాటి మంజుల మనవరాలు జోవిక విజయ్ కుమార్ టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. చిత్రంలో ఆమె 'హరిణి' అనే పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా, దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఆమెను ఒక తీవ్రమైన శక్తిగా అభివర్ణించారు మేకర్స్. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బాలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రావణ్ రెడ్డి 'సింహ'గా, కామాక్షి భాస్కర్ల 'మహాదేవి'గా నటిస్తుండగా, ఉల్కా గుప్తా, షిజు అబ్దుల్ రషీద్ వంటి తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు సుమారు 45 నిమిషాల పాటు సాగే భారీ వీఎఫ్ఎక్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం సంగీతాన్ని అందిస్తుండగా, నాని చమిడిశెట్టి ఛాయాగ్రహణం, జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ మరియు రాజీవ్ నాయర్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.




## కందుల సులోచనగా అనుపమ

టాలీవుడ్ నటుడు శర్వానంద్ కథానాయకుడిగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కి-స్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' . ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా తాజాగా ఈ సినిమా నుంచి కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో అనుపమ కందుల సులోచనా రాణి అనే గ్రామీణ యువతిగా కనిపించబోతుంది. చేతిలో క్యారేజీ, మోదుగ ఆకులు పట్టుకుని ఉన్న పోస్టర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో ఈ సినిమా సాగబోతున్నట్లు సమాచారం. సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న ఈ హై-వోల్టేజ్ డ్రామాలో శర్వానంద్ ఊరమాస్ అవతారంలో కనిపిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరియు డింపుల్ హయాతీ ఫీమేల్ లీడ్స్ గా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 28, 2026 న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.




## దృశ్యం-3 టీజర్ విడుదల

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 'దృశ్యం 3' టీజర్ ఎట్టకేలకు విడుదలైంది. బుధవారం సాయంత్రం విడుదలైన ఈ టీజర్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ వీడియోలో గత రెండు భాగాలకు సంబంధించిన కీలక ఘట్టాలను గుర్తు చేస్తూనే, మూడో భాగంపై భారీ అంచనాలను పెంచేశారు దర్శకుడు జీతూ జోసెఫ్. గతంలో తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి అత్యంత ధైర్యంగా, ప్రశాంతంగా ఎత్తుగడలు వేసిన జార్జ్ కుట్టీ, ఈసారి మాత్రం తీవ్రమైన భయంలో కనిపిస్తుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'ఇప్పుడు నాకు భయంగా ఉంది సార్.. నన్ను ఇంకెవరో గమనిస్తున్నారని అనిపిస్తోంది' అంటూ మోహన్‌లాల్ చెప్పే డైలాగ్ ఈసారి కథలో ఏదో పెద్ద ప్రమాదం పొంచి ఉందని సూచిస్తోంది. ఈ టీజర్‌లో మీనా, అన్సిబా, ఎస్తేర్ అనిల్ తో పాటు ఆశా శరత్ వంటి పాత పాత్రలన్నీ కనిపించి సందడి చేశాయి. ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌లాల్ పుట్టినరోజైన మే 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఈ మూడవ భాగంతోనే సెన్సేషనల్ సిరీస్‌కు ముగింపు పలకనున్నట్లు తెలుస్తోంది. ఇక మలయాళ టీజర్ రావడంతో తెలుగులో విక్టరీ వెంకటేష్ నటించే రీమేక్ ఎప్పుడుంటుందా అని టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతానికి తెలుగు రీమేక్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ, మలయాళ వె-ర్షన్ విడుదలైన తర్వాత అక్కడ వచ్చే స్పందనను బట్టి రీమేక్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## ఓటీటీలోకి బైకర్ విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా 'బైకర్' ఓటీటీలోకి రాబోతుంది. భారతదేశంలోనే మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం, థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకుంది. దీంతో ఈ చిత్రం మే 1 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది. ఇక హిందీలో ఈ సినిమాను 'శర్వా' అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్ తన కెరీర్‌లో ఎదుర్కొనే సవాళ్లు, తండ్రి ఆశయాల కోసం అతను చేసే పోరాటాన్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. థియేటర్లలో మిశ్రమ స్పందన లభించినప్పటికీ, రేసింగ్ సీక్వెన్స్ మరియు టెక్నికల్ వాల్యూస్ పరంగా సినిమాకు మంచి ప్రశంసలు దక్కాయి.





## కల్కిలో నటించడం లేదు

రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు నాగ్ అశ్విన్‌ల కాంబినేషన్‌లో వచ్చిన 'కల్కి 2898 ఏడీ' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న ఈ చిత్ర సీక్వెల్‌కు సంబంధించి గత కొద్దిరోజులుగా ఒక ఆసక్తికర వార్త నెట్టింట హల్చల్ చేస్తోంది. టాలీవుడ్ సీనియర్ నటుడు జేడీ చక్రవర్తి ఈ రెండో భాగంలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతుంది. అయితే తాజాగా తన సినిమా 'గాయపడ్డ సింహం' ప్రమోషన్లలో పాల్గొన్న ఆయన ఈ రూమర్లపై స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'కల్కి 2'లో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, ఇప్పటివరకు తాను ఎలాంటి షూటింగ్‌లోనూ పాల్గొనలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రచారాన్ని కేవలం సరదాగా ఎంజాయ్ చేశానని చెబుతూ, ఆ వార్తలకు జేడీ స్వస్తి పలికారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ  జరుపుకుంటున్న ఈ సీక్వెల్‌లో ప్రభాస్ భైరవ, కర్ణ పాత్రలతో పాటు మరో విభిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాల పాత్రల నిడివి ఈసారి మరింత ఎక్కువగా ఉంటుందని సమాచారం.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com